teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 152 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 27 సెప్టెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ‘5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## ప్రభుత్వ ఆఫీసుల్లో సీఎం రేవంత్ రెడ్డి ఫోటో తప్పనిసరి

### ఈ ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర సర్కార్

### సెలెక్ట్ చేసిన ఫోటో నమూనా విడుదల



Sri A.Revanth Reddy
Chief Minister of Telangana

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణలోని అన్ని ప్రభుత్వ ఆఫీసుల్లో తప్పనిసరిగా సీఎం రేవంత్ రెడ్డి ఫోటో ఏర్పాటు చేయాలని సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం సెలెక్ట్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి ఫోటో నమూనాను కూడా ఇప్పటికే విడుదల చేసింది. అక్టోబర్ 7 లోపు తప్పకుండా సీఎం ఫోటో పెట్టాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు, డివిజన్, మండల అధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు పూర్తైనప్పటికీ ఇంతవరకూ కొన్ని ప్రభుత్వ

మిగతా 2 లో

# పెరిగిన కార్మికుల కనీస వేతనం

## రెట్లను పెంచుతూ కేంద్రం నిర్ణయం

**ఏ, బి, సీ లుగా వర్గీకరించబడ్డ కార్మికుల నైపుణ్య స్థాయిలు**

**పెరుగుతున్న జీవన వ్యయం దృష్ట్యా ప్రభుత్వం ప్రకటన**

**2024 అక్టోబర్ 1 నుండి వర్తించనున్న పెరిగిన వేతనాలు**





**కార్మికులకు, అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పండగలకు ముందు కానుక ఇచ్చింది. ఈ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాన్ని పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.**

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): వేరియబుల్ డియర్‌నెస్ అలవెన్స్‌ను సవరించడం ద్వారా కార్మికులకు కనీస వేతనాన్ని రోజుకు రూ.1,035 వరకు పెంచుతూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ద్రవ్యోల్బణం కారణంగా పెరుగుతున్న జీవన వ్యయం దృష్ట్యా ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. పెరిగిన వేతనాలు

మిగతా 2 లో





## దసరా సెలవుల తర్వాతే సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు

### ఈ మేరకు విద్యా శాఖ షెడ్యూల్‌ను విడుదల

**తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-1) పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. దసరా సెలవుల అనంతరం ఈ పరీక్షలు జరగనున్నాయి. అక్టోబర్ 21 నుంచి 28వ తేదీ వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ 1 పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి సెప్టెంబర్ 25 (బుధవారం)న పూర్తిస్థాయి టైంటేబుల్ విడుదల చేశారు.**

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): ఒకటి, రెండు తరగతులకు సెప్టెంబర్ 21, 22, 23 తేదీల్లో పరీక్షలు జరుగుతాయి. 3 నుంచి 5 తరగతులకు సెప్టెంబర్ 21 నుంచి 24వ తేదీ వరకు, ఆరు, ఏడు తరగతులకు సెప్టెంబర్ 26వ తేదీ వరకు, 8 నుంచి 10 తరగతుల వారికి సెప్టెంబర్ 28వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. కాగా తెలంగాణ రాష్ట్రంలోని విద్యా సంస్థలకు కాలేజీలకు వరుసగా 13 రోజులు సెలవులు రానున్నాయి. అక్టోబర్ 2 నుంచి అక్టోబర్ 14 వరకూ సెలవులు ఇస్తున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది కూడా. అక్టోబర్ 2 గాంధీ

మిగతా 2 లో

## నెల రోజుల్లోనే ప్రజలందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు

**సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం**

**క్యాన్సర్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో సీఎం వ్యాఖ్యలు**



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): ప్రజలందరికీ మెరుగైన వైద్య సదుపాయాలు అందించడమే తమ ప్రభుత్వం లక్ష్యం అన్నారు సీఎం రేవంత్ రెడ్డి. గురువారం విద్యానగర్ లోని దుర్గాబాయ్ దేశ్ ముఖ్ రెనెవా క్యాన్సర్ ఆసుపత్రిని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల్లోనే ప్రజలందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. సామాన్య ప్రజలకు కూడా మెరుగైన వైద్యసేవలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. సాధారణ ప్రజలు అనారోగ్యం పాలైన ప్రతిసారి టెస్టులకే వేల రూపాయల ఖర్చు

మిగతా 2 లో



## హైదరాబాద్‌లో డీజేలపై పోలీసులు అలెర్ట్

**నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్న పోలీసులు**

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లో డీజేల వ్యవహారంపై అన్నివర్గాల ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. అన్ని రాజకీయ పార్టీల నేతలతోపాటు మత పెద్దల నుంచి కూడా ఫిర్యాదులు అందడంతో హైదరాబాద్

మిగతా 2 లో

## యువత భవిత కోసం ప్రభుత్వం విస్తృత చర్యలు

**నిరుద్యోగులకు నైపుణ్యకు స్కిల్ యునివర్సిటీ ఏర్పాటు**

**రానున్న రోజుల్లో ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ కాలేజీ**

**రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**




హైదరాబాద్, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణ యువత భవిత కోసం తమ ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నిరుద్యోగులకు నైపుణ్య విద్య అందించడానికి ఈ ప్రభుత్వం స్కిల్ యునివర్సిటీని ఏర్పాటు చేసిందని, ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ప్రతి జిల్లా కేంద్రంలో స్కిల్ డెవలప్మెంట్ కాలేజీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. యూసుఫ్ గూడలోని నిమ్స్ మే లో

మిగతా 2 లో

## సదుపాయాల కల్పించడంలో ఫారెస్ట్ రూల్స్‌ఆటంకం

### అటవీ ప్రాంత గ్రామాల అభివృద్ధికి అధికారం ఇవ్వాలి

### పైసా చట్టంపై జాతీయ సదస్సులో మంత్రి సీతక్క



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో పైసా చట్టంపై జాతీయ సదస్సును నిర్వహించారు. పైసా చట్టం అమలు, ఎదురవుతున్న సవాళ్లపై చర్చించారు. గిరిజనాభివృద్ధి, చట్ట అమల్లోని ఇబ్బందులపై డిస్కషన్ చేశారు. ఈ సదస్సుకు రాష్ట్ర మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. సెంట్రల్‌నుంచి వచ్చిన ఫండ్స్‌ని వినియోగించడంలో అటవీ శాఖ అధికారుల తీరుతో గ్రౌండ్‌చేయలేకపోతున్నామని

మిగతా 2 లో



## హిందూ పండుగలను టార్గెట్ చేస్తూ డీజే, ఫైర్ క్రేకర్స్ బ్యాన్

**సౌండ్స్ బంద్ చేస్తే టెంపుల్స్‌లో సౌండ్స్ బంద్ చేస్తాం**

**ఏం చేసినా యథావిధిగా ఉత్సవాలు జరుపుతాం**

**గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ హాట్ కామెంట్స్**

2



## కేటీఆర్‌కు సృజన్‌రెడ్డి లీగల్ నోటీసులు

**టెండర్లలో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై నోటీసులు ఇచ్చినట్లు సమాచారం**

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సృజన్ రెడ్డి లీగల్ నోటీసులు జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం శోధ కంపెనీకి ఇచ్చిన అమృత్ పథకం టెండర్లలో అవినీతి జరిగిందని చేసిన ఆరోపణలపై ఈ నోటీసులు

మిగతా 2 లో

## ప్రతి విద్యార్థికి రోడ్ సేఫ్టీ అవేర్నెస్‌కు చర్యలు

**రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**అధికారులను ఆదేశించిన మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో ప్రతి విద్యార్థికి రోడ్ సేఫ్టీ అవేర్నెస్ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. బుధవారం

మిగతా 2 లో

## మూసీ పరివాహక ప్రాంతంలో నిర్వాసితుల ఆందోళన

**పోలీసు బందోబస్తు మధ్య అధికారుల సర్వే**



.. వివరాలు 2లో

## కల్తీ నెయ్యి తయారీ కలకలం

**ఏకంగా 15వేల కేజీల కల్తీ నెయ్యి సీజ్**


**ఓ కల్తీ నెయ్యి తయారీ కేంద్రంపై ఎస్ఓటి పోలీసుల దాడులు**



.. వివరాలు 2లో

## తెలుగు రాష్ట్రాల్లో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు జిల్లాల్లోనూ ఇవాళ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. తెలంగాణలోని 14 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కామారెడ్డి జిల్లాల్లో ఇవాళ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. హైదరాబాద్‌లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. పిడుగులు పడే ప్రమాదం కూడా ఉందని హెచ్చరించింది. గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు. హైదరాబాద్ నగరంలో గడిచిన నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఒక్కసారిగా కుండపోత వాన కురుస్తుండటంతో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోని వరద నీరు చేరింది.

## దసరా సెలవుల తర్వాతే సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు

మొదటి పేజీ తరువాయి

జయంతి కాగా మిగిలిన రోజుల్లో దసరా, బతుకమ్మ రెండు పండుగలు వస్తాయి. రాష్ట్రంలో బతుకమ్మ ప్రధాన పండుగ కావడంతో రెండు సెలవులు కలిపి ఇచ్చేశారు. తెలంగాణ ప్రభుత్వం మే 25న విడుదల చేసిన అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం కూడా ఇవే సెలవులు రానున్నాయి. ఇక క్రిస్మస్ సెలవులు డిసెంబర్ 23 నుంచి 27 వరకు ఉంటాయి. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 17 వరకూ సంక్రాంతి సెలవులుంటాయి.

## నెల రోజుల్లోనే ప్రజలందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు

మొదటి పేజీ తరువాయి




అవుతోందని, ఇది సామన్యులకు మరింత భారంగా మారుతోందని తెలియజేశారు. హెల్త్ కార్డులు ఉండటం వలన హెల్త్ ప్రొఫైల్ సులువుగా అర్థమయ్యి చికిత్స సులభం అవుతుందని సీఎం అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ ముందు చూపు వల్లే దేశంలో వైద్య రంగం గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. క్యాన్సర్ వ్యాధి గురించి ప్రజల్లో అవగాహన చాలా తక్కువని.. క్యాన్సర్ వ్యాధికి వైద్య సదుపాయాలు మన దగ్గర తక్కువగా ఉన్నాయని, చికిత్సకు అయ్యే ఖర్చు మాత్రం సామాన్యులకు అందుబాటులో లేదని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో మరిన్ని క్యాన్సర్ ఆసుపత్రులు ఏర్పాటు జరగాలని, సామాన్యులకు కూడా క్యాన్సర్ చికిత్సలు అందుబాటులోకి రావాలని సీఎం ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

## హిందూ పండుగలను టార్గెట్ చేస్తూ డీజే, ఫైర్ క్రేకర్స్ బ్యాన్

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): డీజేలపై నిషేధం సరైంది కాదని, డీజేలపై ఆధారపడి బతికే వాళ్ళు కూడా ఉన్నారని బీజేపీ ఫైర్ బ్రాండ్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. మతపరమైన ర్యాలీల్లో డీజే, టపాసుల వాడకంపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం సీవీ ఆనంద్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే రాజాసింగ్ హాజరయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ హిందూ పండుగలను టార్గెట్ చేస్తూ డీజే, ఫైర్ క్రేకర్స్ బ్యాన్ చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. డీజే, క్రాకర్స్ బ్యాన్ చేయాలని ప్రభుత్వం ఆల్రెడీ నిర్ణయం తీసుకున్నట్టు ఉందని, ఏదో అందరినీ పిలిచి ఒకమాట చెప్పాలన్నట్లుగా ఇవాళ్టి సమావేశం జరిగిందని అన్నారు. వెహికిల్‌లో స్పీడ్ లిమిట్‌కి ఎలా లాక్ ఉంటుందో అదే మాదిరి డీజే సౌండ్ లిమిట్ పెట్టాలని, అంతేకానీ పూర్తిగా డీజేలను నిషేదించడం సరికాదని అభిప్రాయపడ్డారు. రోజుకు నాలుగు సార్లు వినిపించే సౌండ్స్ బంద్ చేస్తే మా టెంపుల్స్‌లో సౌండ్స్ బంద్ చేస్తామని తేల్చి చెప్పారు. మతపరమైన కార్యక్రమాల్లో డీజేలు, ఫైర్ క్రాకర్స్ బ్యాన్ హిందూ పండుగలను తొక్కిపెట్టే ప్రయత్నమేనని హాట్ కామెంట్స్ చేశారు. కేసులు పెట్టనివ్వండి ఏమైనా చేసుకోనివ్వండని మేము మాత్రం యథావిధిగా మా ఉత్సవాలు చేసుకుంటామని స్పష్టం చేశారు. నేను 2010 నుంచి శ్రీరామ నవమి ర్యాలీలు నిర్వహిస్తున్నా.. కానీ ఎక్కడ ఎలాంటి ప్రాబ్లమ్ రాలేదని గుర్తు చేసిన రాజాసింగ్.. శ్రీరామ నవమి ర్యాలీలో తప్పకుండా డీజే పెడ్తామని తేల్చి చెప్పారు.

## ప్రతి విద్యార్థికి రోడ్ సేఫ్టీ అవేర్నెస్ కు చర్యలు

మొదటి పేజీ తరువాయి

రవాణా శాఖలో ఆదాయ మార్గాలను పెంచేందుకు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రవాణా ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, కమిషనర్ ఇలంబర్తి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు రమేష్, మమతలు పాల్గొన్నారు. గతంలో సీఎం నిర్వహించిన సమీక్షలో చేసిన సూచనలు ఎంత వరకు ముందుకు వెళ్తున్నాయని మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. స్కూల్ బస్సుల ఫిట్నెస్ విషయంలో కఠినంగా వ్యవహరించాలని, ఆటోల్లో విద్యార్థులను తీసుకొని ఓవర్ లోడ్ తో తీసుకెళ్తున్న వారిపై అధికారులు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు రోడ్డు సేఫ్టీ పై ఆధునిక సాంకేతిక పద్ధతిలో కరికులం ఉండాలని తెలిపారు. ప్రతి సంవత్సరం దేశంలో రోడ్డు ప్రమాదాలలో లక్షా 60 వేల మంది మరణిస్తుండగా.. తెలంగాణలో 20 మంది మృత్యువాత చెందుతున్నారని వీటిని నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## ప్రభుత్వ ఆఫీసుల్లో సీఎం రేవంత్ రెడ్డి ఫోటో తప్పనిసరి

మొదటి పేజీ తరువాయి

కార్యాలయాల్లో సీఎం ఫోటో లేకపోవడంపై పలువురు నాయకులు ప్రత్యేకంగా ప్రభుత్వానికి విన్నవించగా.. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ అక్టోబర్ 7 వరకు గడువునిచ్చింది. సీఎం ఫోటో ఏర్పాటు చేయని అధికారులపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించింది.

# పెరిగిన కార్మికుల కనీస వేతనం





మొదటి పేజీ తరువాయి

2024 అక్టోబర్ 1 నుండి వర్తిస్తాయి. పెరుగుతున్న జీవన వ్యయాలను తట్టుకునేలా కార్మికులకు సహాయపడే లక్ష్యంతో ఈ సవరణలు చేసినట్లు కార్మిక మంత్రిత్వ శాఖ పేర్కొంది.

**సవరణల తర్వాత కనీస వేతన రేట్లు**

- నిర్మాణ, స్వీపింగ్, క్లీనింగ్, లోడింగ్, అన్‌లోడింగ్‌లో నైపుణ్యం లేని పని కోసం కార్మికులకు 'ఏ' ప్రాంతంలో కనీస వేతనాలు రోజుకు రూ. 783 (నెలకు రూ. 20,358)గా సవరించారు.
- సెమీ స్కిల్డ్ కార్మికులకు, కనీస వేతనం రోజుకు రూ. 868 (నెలకు రూ. 22,568)గాను సవరించారు.
- పనిముట్లు అవసరం లేని, క్లరికల్ వంటి కార్మికులకు రోజుకు రూ. 954 (నెలకు రూ. 24,804) గా సవరించారు.
- అత్యంత నైపుణ్యం కలిగిన కేటగిరికి చెందిన కార్మికుల కనీస వేతన రేటు రోజుకు రూ. 1,035 (నెలకు రూ. 26,910) గా నిర్ధారించింది.
- కాగా కొత్త వేతన రేట్లు అక్టోబర్ 1, 2024 నుండి అమలులోకి వస్తాయి. కార్మికుల వేతన రేట్లకు సంబంధించిన చివరి సవరణ ఏప్రిల్ 2024లో జరిగింది. అయితే కనీస వేతన రేట్ల నైపుణ్య స్థాయిలు అన్ స్కిల్డ్, సెమీ-స్కిల్డ్, స్కిల్డ్ మరియు హైలీ స్కిల్డ్ తోపాటు భౌగోళిక ప్రాంతం ఆధారంగా ఏ, బి మరియు సీ లుగా వర్గీకరించబడ్డాయి.

## హైదరాబాద్‌లో డీజేలపై పోలీసులు అలెర్ట్

మొదటి పేజీ తరువాయి



పోలీసులు అలెర్ట్ అయ్యారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్స్ సెంటర్ వేదికగా డీజేలపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో డీజేల వ్యవహారం ఈ ఏడాది మరింత శృతిమించిందన్నారు సీపీ సీవీ ఆనంద్. గణేష్ నిమజ్జనం, మిలాద్ ర్యాలీల్లో డీజేలు హోరెత్తించడంతో అన్ని వర్గాల నుంచి ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. రౌండ్ టేబుల్ సమావేశంలో అందరి అభిప్రాయాలతో డీజేలపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు సీపీ సీవీ ఆనంద్. ఇదిలావుంటే, పలు ర్యాలీల్లో విపరీతమైన డీజే సౌంట్లు, టపాసుల వాడకం పెరిగిన నేపథ్యంలో అన్నివర్గాల ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే దీనిపై సీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్స్ సెంటర్‌లో ఈ రౌండ్ టేబుల్ మీటింగ్ జరిగింది. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6గంటల వరకు లౌడ్‌స్పీకర్స్‌ల వినియోగాన్ని గతంలోనే నిషేధించారు. ఇక డీజేల విషయంలోనూ నిబంధనల ఉల్లంఘన జరుగుతోంది. నివాస ప్రాంతాల్లో పగలు 55 డెసిబెల్స్, రాత్రి 45 డెసిబెల్స్‌కి సౌండ్ మించకూడదు. కమర్షియల్ ఏరియాల్లో పగలు 65 డెసిబెల్స్, రాత్రి 55 డెసిబెల్స్ వరకే సౌండ్‌కి పరిమితి ఉంటుంది. పారిశ్రామిక ప్రాంతాల్లో పగలు 75 డెసిబెల్స్, రాత్రి 70 డెసిబెల్స్‌కి లిమిట్ చేస్తూ నిబంధనలున్నాయి. ఇక స్కూళ్లు, కాలేజీలు, ఆసుపత్రుల ఉన్న ప్లేస్‌లైతే పూర్తిగా సైలెంట్ జోన్స్. కానీ వీటిని పట్టించుకోకుండా డీజేలు హోరెత్తుతున్నాయి. అందుకే వీటిని కంట్రోల్ చేయడం ఎలాగనే దానిపై రౌండ్ టేబుల్ మీటింగ్‌లో చర్చించారు. వివిధ వర్గాల అభిప్రాయలను సేకరించిన హైదరాబాద్ పోలీసులు పూర్తి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తారు.

## సదుపాయాల కల్పించడంలో ఫారెస్ట్ రూల్స్‌ఆటంకం

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. దీంతో కేంద్ర ఇచ్చిన నిధులు కూడా ఏళ్ల కొద్ది పెండింగ్ లో ఉంటున్నాయని తెలిపారు. పదిరాష్ట్రాల్లో పైసా యాక్ట్ అమల్లో ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని చోట్ల రోడ్లు మౌలిక సదుపాయాల కల్పించడంలో కొన్ని ఫారెస్ట్ రూల్స్‌ఆటంకం కలిగిస్తున్నాయి. గ్రామ సభ ద్వారానే అభివృద్ధి ఏజెండాను నిర్ణయించేలా చర్యలు తీసుకోవాలి. అటవీ ప్రాంత గ్రామాల అభివృద్ధికి గ్రామ సభలకు అధికారం ఇవ్వాలి. రాష్ట్రంలో హైడ్రాకు స్వయం ప్రతిపత్తి ఇచ్చాం. రాష్ట్రంలో పెద్దపట్టణాల్లో హైడ్రా లాంటి వ్యవస్థ ను తీసుకురావాలని డిమాండ్ వస్తుంది. కబ్జాదారులు కొంతమంది పేదలను ముందుపెట్టి వారి అక్రమ నిర్మాణాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రకృతిని కాపాడంతో హైడ్రా గొప్పగా పనిచేస్తుంది. కూల్చివేతలతో పేదలకు నష్టం కలగకుండా చూడాలని, వారిని ఆదుకునే దిశగా సీఎం నిర్ణయం తీసుకుంటున్నారు. పైసా యాక్ట్అమలు ఉన్న రాష్ట్రాల్లో గ్రామసభల తీర్మాణంతో అన్ని అనుమతులు తీసుకోవచ్చు. గ్రామసభల తీర్మాణమే ఫస్ట్అని పైసా యాక్ట్చెప్పుతున్నట్లుగా మంత్రి సీతక్క తెలిపారు.

## మూసీ పరివాహక ప్రాంతంలో నిర్వాసితుల ఆందోళన



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): మూసీ నది పరివాహక ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు మధ్య అధికారుల సర్వే కొనసాగుతోంది. హైదరాబాద్ జిల్లా పరిధిలో 16 బృందాలు సర్వే చేస్తున్నాయి. రంగారెడ్డి జిల్లాలో నాలుగు, మేడ్చల్ మల్కాజిగిరి పరిధిలో 5 బృందాలతో సర్వే జరుగుతోంది. నదీ గర్భంలోని నిర్వాసితుల నిర్మాణాల వివరాలను రెవెన్యూ అధికారులు అడిగి తెలుసుకుంటున్నారు. మూసీ నదిలో ఉన్న బఫర్ జోన్‌లోని నిర్మాణాలకు మార్క్ చేస్తున్నారు. చాదర్‌ఘాట్, మూసానగర్, శంకర్‌నగర్ లోని మూసీ పరివాహక ప్రాంతాల్లో అధికారులు సర్వే చేపట్టారు. హిమాయత్‌నగర్, గోల్కొండ పరిధిలోని ఇబ్రహీంబాగ్, లంగర్‌హౌస్ డిఫెన్స్ కాలనీలో అధికారులు సర్వే చేపట్టారు. కొత్త పేట, సత్యానగర్, చైతన్య పురి, ఫణిగిరి కాలనీ, ఇందిరా నగర్, గణేష్ పురి కాలనీలలో గురువారం రోజు ఉప్పల్ రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించడం ఆ ప్రాంత ప్రజలు మండిపడుతున్నారు. ఆందోళనకు దిగడతో అధికారులు వెనుదిరిగారు. నిర్మాణాలకి అనుమతి ఇచ్చి, ఇప్పుడు సర్వే చేసి కూల్చుతామంటే ఊరుకోబోమంటున్నారు. తమ ఇండ్ల జోలికి ఎవరు రావద్దని ఆందోళన వ్యక్తం చేశారు. 30 ఏళ్ళ నుంచి వెంచర్లు వేస్తుంటే అధికారులు ఏం చేశారంటున్నారు. ఇప్పుడు వెళ్ళగొడతామంటే ఊరుకునేది లేదన్నారు బాధితులు.

## యువత భవిత కోసం తమ ప్రభుత్వం విస్తృత చర్యలు



మొదటి పేజీ తరువాయి

నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ స్వల్పకాలిక శిక్షణ పథకం కింద "స్వచ్ఛత హి సేవా" ఈవెంట్ ను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను ఆకర్షించే అగ్రగామి గమ్యస్థానంగా తెలంగాణాను తీర్చిదిద్ది, స్థానికంగాను, విశ్వవ్యాప్తంగాను సులభంగా ఉద్యోగాలు పొందడానికి అవసరమైన నైపుణ్య అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. శిక్షణ ఇచ్చేందుకు 130 మంది నిపుణులను టీటీఎల్ నియమిస్తుంది. ఏటీసీల్లో ఏటా 15,860 మందికి ఆరు రకాల దీర్ఘకాల కోర్సుల్లో, 31,200 మందికి 23 రకాల స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ అందిస్తారన్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలోని ఐటీఐల్లో కేవలం 1.5 లక్షల మంది మాత్రమే శిక్షణ పొందగా, ఈ ఏటీసీలతో రానున్న పదేళ్లలో నాలుగు లక్షల మంది శిక్షణ పొందే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని అన్నారు. రూ.2,324 కోట్ల వ్యయంతో ఐటీఐలను ఏటీసీలుగా మార్చబోతున్నామని ప్రకటించారు. ఏటీసీలు కేవలం వివిధ కోర్సుల్లో శిక్షణకే పరిమితం కాకుండా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా పని చేస్తాయన్నారు. అలాగే ఈ ఏటీసీలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, భారీ పరిశ్రమలకు సాంకేతిక కేంద్రాలుగానూ (టెక్నాలజీ హబ్) పని చేస్తాయన్నారు.

## కేటీఆర్‌కు సృజన్ రెడ్డి లీగల్ నోటీసులు

మొదటి పేజీ తరువాయి

ఇచ్చినట్లు తెలిపారు. కాగా కొద్ది రోజుల క్రితం తెలంగాణ ప్రభుత్వం అమృత్ టెండర్లలో అవినీతికి పాల్పడుతోందని ఆరోపిస్తూ వెంటనే విచారణ చేపట్టి.. నిజాలను బహిర్గతం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ కట్టర్, టోచన్ సాహూలకు గత శుక్రవారం లేఖలు రాశారు. కేంద్రం అమృత్ పథకం ద్వారా రాష్ట్రానికి కేటాయించిన నిధుల్లో దాదాపు రూ.1500 కోట్ల టెండర్లు సీఎం సొంత బావమరిదిసృజన్ రెడ్డికి చెందిన శోధ కంపెనీకి అర్హతలు లేకున్నా కట్టబెట్టారని, వెంటనే ఈ ఆరోపణలపై కేంద్రం విచారణ జరిపి నిజాలను నిగ్గు తేల్చాలని కోరారు. కాగా ఈ ఆరోపణలపై సృజన్ రెడ్డి కేటీఆర్‌కు లీగల్ నోటీసులు జారీ చేశారు. సోషల్ మీడియా, వెబ్ సైట్ నుండి కంటెంట్ తొలిగించాలని, బహిరంగ క్షమాపణలు చెప్పాలని సృజన్ రెడ్డి కేటీఆర్ ను ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు.

## కల్తీ నెయ్యి తయారీ కలకలం

రంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కల్తీ నెయ్యి తయారీ కేంద్రంపై ఎస్ఓటి పోలీసులు దాడులు నిర్వహిచారు. తిరుమల లడ్డు తయారీకి వాడే నెయ్యి కల్తీ జరిగిందని వివాదం నడుస్తోన్న సమయంలో ఈ కల్తీ నెయ్యి తయారీ కలకలం రేపింది. ఏకంగా 15వేల కేజీల కల్తీ నెయ్యి అధికారులకు చిక్కింది. మైలర్ దేవ్ పల్లి కాటేదాన్ పారిశ్రామిక వాడలోని కల్తీ నెయ్యి కేంద్రంపై గురువారం రాజేంద్రనగర్ ఎస్ఓటి పోలీసులు రైడ్స్ చేశారు. అపరిశుభ్ర వాతావరణంలో, నిబంధనలకు విరుద్ధంగా నెయ్యి తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సంఘటన స్థలానికి చేరుకున్న మైలర్ దేవ్ పల్లి పోలీసులు పరికరాలను పరిశీలిస్తున్నారు. 15 వేల కేజీల కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన మెటీరియల్ ను ఎస్ఓటీ పోలీసులు మైలర్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసులు వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం ఇచ్చారు.



తీన్మార్
తెలుగు దినపత్రిక

## మణిపూర్ మంటలు చల్లారేది ఎప్పుడు

ఈశాన్య ప్రాంతంలో వివిధ జాతుల గ్రూపుల మధ్య, అస్తిత్వ సంక్షోభం జాతుల మధ్య సంఘర్షణలు పెక్కింటికి దారి తీసింది. ఈశాన్య భారతంలో సంఘర్షణ పరిస్థితిని అర్థం చేసుకోవడం సంక్లిష్టమైన అంశం. ఆ ప్రాంత సాంఘిక, సాంస్కృతిక, చారిత్రక, జాతుల రూపురేఖల గురించి లోతైన అవగాహన కలిగి ఉండడం అవసరం. నాలుగు దేశాల అంతర్జాతీయ సరిహద్దులతో ఈశాన్య భారతం కీలకమైన, వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రాంతం. ఈశాన్య ప్రాంతంలోని రాష్ట్రాలు అన్నీ సాంస్కృతికంగా, భాషపరంగా, మతపరంగా భిన్నస్వభావం కలవి. భాష సంబంధిత అంతరంపరంగా విభిన్నతలు, మంగ్లాయిడ్, ఆస్ట్రలాయిడ్ జాతి మూలాలు, మతపరమైన బహుత్వం ఆ ప్రాంతాన్ని విలక్షణమైనదిగా చేశాయి. ఈశాన్య భారతంలో అసమ్మతికి ప్రధాన కారణాలు భాష సంబంధిత సాంస్కృతిక లొంగుబాటు భయం, ఆర్థికపరమైన అలక్ష్యం, రాజకీయ శక్తుల వైఫల్యాలు. ఈశాన్యంలో అస్తిత్వ రాజకీయాలకు ప్రధాన కారణం జాతి ప్రజల విలక్షణ మనస్తత్వం. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక భావన కోల్పోతామేమోనన్న ఉద్దేశంతో ప్రత్యేక హక్కులు పొందాలనే మనస్తతం వారిది. తమ అస్తిత్వాన్ని చాటిచెప్పడానికి ఈశాన్యంలో పలు జాతి ఉద్యమాలు చోటుచేసుకున్నాయి. జాతుల మధ్య అశాంతి దేశానికి నేరుగా ఒక సవాల్. అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ జాతుల, సాంస్కృతిక, మతపర, భాషాపర వర్గాల సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. వివిధ ప్రభుత్వాలు ఈశాన్యంలో తిరుగుబాటు సమస్య పరిష్కారానికి విభిన్న విధానం అనుసరిస్తూ వచ్చాయి. మరొక గ్రూపును తుడిచిపెట్టేందుకు ఒక గ్రూపును ప్రోత్సహించడం, ప్రధాన స్రవంతిలోకి తిరిగి వచ్చేందుకు ప్యాకేజీలు అందజేయడం, ఒప్పందం కుదుర్చుకునేందుకు సంభాషణ కర్తలను నియోగించడం, తిరుగుబాటు నిరోధక సైనిక కార్యకలాపాలు మొదలైనవి ప్రభుత్వం తిరుగుబాటు సమస్య పరిష్కారానికి అనుసరించిన వ్యూహాలు. అయితే. ప్రభుత్వం అనుసరించిన ఆ విధానాలు ఫలితాలను ఇచ్చాయి. జయప్రదంగా ఒప్పందం కుదుర్చుకున్న తరువాత అనేక తిరుగుబాటు సంస్థలు లొంగిపోయాయి. ఆ ఒప్పందం కొత్త రాష్ట్రం, రాజ్యాంగం ఐదవ లేక ఆరవ షెడ్యూల్ కింద రాష్ట్రం పరిధిలోనే స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రాంతం ఏర్పాటుకు దారితీసింది. అయితే, ఈశాన్య ప్రాంతంలో తిరుగుబాటు ధోరణి విష వలయం నెమ్మదించడం లేదు. పూర్వపు గ్రూపులు ప్రధాన స్రవంతిలో కలసిపోయిన మరుక్షణం కొత్తగా తీవ్రవాద వర్గాలు ఆవిర్భవిస్తున్నాయి. బంగ్లాదేశ్ నుంచి రాష్ట్రంలోకి విదేశీ జాతీయుల చొరబాటుకు వ్యతిరేకంగా 1979లో మొదలై ఆరు సంవత్సరాలు సాగిన అస్సాం ఉద్యమం ఈశాన్య భారత చరిత్రలో సుదీర్ఘ సాంఘిక అశాంతుల్లో ఒకటిగా నిలిచింది. చారిత్రక అస్సాం ఒప్పందంపై సంతకాలు జరగడంతో ఆ ఉద్యమం 1985లో అంతమైంది. ఆ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, యువ నాయకులు పూర్వపు అసమ్ గణపరిషత్ (ఎజిపి) పేరిట ప్రాంతీయ పార్టీని ఏర్పాటు చేసిన తరువాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారు. అస్సాం ప్రజల కోసం స్వతంత్ర సార్వభౌమ దేశం ఏర్పాటు డిమాండ్‌తో 'అస్సాం సమైక్య విమోచన కూటమి (ఉల్ఫా) పేరిట అస్సాంలో బలమైన తిరుగుబాటు గ్రూప్ ఆవిర్భావానికి అస్సాం ఉద్యమం వీలు కల్పించింది. అగ్రశ్రేణి నాయకులు అనేక మంది తమ అనుచరులతో కలసి ప్రభుత్వానికి లొంగిపోయి ప్రధాన స్రవంతిలో కలిశారు. కానీ, ఒకింత బలహీనపడిన ప్రధాన గ్రూప్ మాత్రం తమ కమాండర్ ఇన్ చీఫ్ పరేష్ బారువా అలియాస్ పరేష్ అసమ్ నాయకత్వంలో ఇప్పటికీ క్రియాశీలకంగా ఉన్నది. 16 మాసాలుగా హింసాత్మక జాతి ఘర్షణలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మణిపూర్ ఇండియన్ యూనియన్‌లో చేరినప్పటి నుంచి పలు జాతుల ఘర్షణలు చూసింది. మణిపూర్‌లో వివిధ భౌగోళిక ప్రాంతాల్లో జనాభా పంపిణీ విలక్షణమైనది. ప్రధానమైన హిందువుల వర్గం మైతైలు మణిపూర్ జనాభాలో 53 శాతం ఉంటారు. కానీ వారికి రాష్ట్రంలోని లోయలో 10 శాతం మాత్రమే భూమి ఉన్నది. మరొక వైపు కుకీలు, నాగాలు చాలా వరకు పర్వత ప్రాంతాల్లో 90 శాతం స్థలాన్ని ఆక్రమించుకుని ఉన్నారు. వారిలో చాలా మంది క్రైస్తవులు. రాష్ట్ర జనాభాలో వారు 40 శాతం ఉంటారు. తాము అధిక సంఖ్యాకులు అయినందున మైతైలకే శాసనసభలో అధిక శాతం ప్రాతినిధ్యం ఉన్నది. అది మైతై ఆధిపత్య తత్వాన్ని ప్రోత్సహిస్తోంది. మెజారిటీ సమాజం చేతుల్లో అధికారం కేంద్రీకృతం కావడం, ప్రాంతీయ, పాలకవర్గ సమగ్రతకు ముప్పు భావన. జాతుల గ్రూపుల్లో వేర్వేరు మతపర అస్తిత్వం నమ్మకం లోటును సృష్టించింది. మైతై ఆధిపత్యవాద తత్వం మణిపూర్‌లో రాజకీయాలను, సామాజిక సంబంధాలను ప్రభావితం చేసింది. మైతై ముఖ్యమంత్రులు గడచిన 34 సంవత్సరాలుగా రాష్ట్రాన్ని పాలిస్తున్నారు. కుకీలు, నాగాల్లో పెరుగుతున్న అసమ్మతికి అది ఒక కారణంగా ఉన్నది. రాష్ట్ర బడ్జెట్, అభివృద్ధి పథకాల్లో అత్యధిక భాగం మైతై ఆధిక్యం గల ఇంఫాల్ లోయపైనే కేంద్రీకృతం అవుతున్నాయని మణిపూర్ మైనారిటీలు ఆరోపించారు. అధికారం, అభివృద్ధి పంపిణీలో అసమతుల్యం, జీవన ప్రదేశాల కోసం పోటీ మణిపూర్‌లో వివాదానికి ప్రధాన కారణం. గతంలో నాగాలు, కుకీ జోల మధ్య, నాగాలు, మైతైల మధ్య హింసాత్మక ఘర్షణల సందర్భాలు ఉన్నాయి. మైతైలు, పంగల్ (ముస్లిం) మైతైల మధ్య అంతర్గత వర్గ దౌర్జన్య సంఘటనలు కూడా 1993లో జరిగాయి. వాటిలో సుమారు 100 మంది మృతి చెందగా, అనేక మంది నిర్వాసితులయ్యారు. 1997 -98లో కుకి పైలే లేదా కుకి జోమి వివాదం వంటి అంతర్‌వర్గ ఘర్షణ కూడా జరిగింది. దానిలో 352 మంది మరణించారు. 13 వేల మందికి పైగా నిర్వాసితులయ్యారు. ఈశాన్యంలోని తిరుగుబాటు గ్రూపులు అన్నిటికీ విదేశీ శక్తుల ప్రాపకం ఉన్నది. తుపాకులు, మాదకద్రవ్యాల సరఫరా, ఆశ్రయం, విదేశీ భూభాగంలో శిక్షణ వంటివి ఆ శక్తులు సమకూరు స్తున్నాయి. తీవ్రవాద సంస్థలు ఒకటి లేదా అంతకు మించిన దేశాల నుంచి, ముఖ్యంగా మయన్మార్, బంగ్లాదేశ్, భూటాన్, చైనా నుంచి కార్యకలాపాలు సాగిస్తుంటాయి. నల్లమందు సేద్యం, జాతివర్గంపై దాడికి డ్రోన్ వినియోగం, మయన్మార్ నుంచి కుకి జో ప్రజలు పెద్ద ఎత్తున చొరబడడం వాస్తవంగా తీవ్ర వివాదంలో పైపై మెరుగు అంశమే.

## బీజేపీ మెగా మెంబర్షిప్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్న చల్ల శ్రీలతరెడ్డి





పాలకవీడు, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): భారతీయ జనతా పార్టీ మెగా మెంబర్షిప్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా హుజూర్నగర్ నియోజకవర్గం పాలకవీడు మండల కేంద్రంలో మండల అధ్యక్షులు గుండ్రెడ్డి విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ మెగా మెంబర్షిప్ డ్రైవ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర నాయకురాలు, సూర్యాపేట జిల్లా సభ్యత్వ ప్రముఖ్, హుజూర్నగర్ నియోజకవర్గ ఇన్చార్జి చల్ల శ్రీలతరెడ్డి హాజరై వార్డు ప్రజలకు భారతీయ జనతా పార్టీ సభ్యత్వం అందించారు. ఈ సందర్భంగా శ్రీలతరెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో సభ్యత్వ కార్యక్రమం వేగంగా నడుస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో తెలంగాణ ప్రజలు భారతీయ జనతా పార్టీని ఆదరిస్తున్నారని తెలిసిపోయింది, అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా 88 00 00 2024 కు మిస్డ్ కాల్ ఇచ్చి భారతీయ జనతా పార్టీలో చేరుతున్నారన్నారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 10 సంవత్సరాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బడుగు బలహీన వర్గాల కొరకు పనిచేస్తున్నారు. పేద ప్రజల సంక్షేమం కొరకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం జరిగింది, కరోనా ఆపద సమయంలో దేశ ప్రజలందరికీ ఉచిత వ్యాక్సినేషన్ ఇప్పించి వారి ప్రాణాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కాపాడడం జరిగింది. భారత దేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టడానికి నిరంతరం ప్రధాన మంత్రి మోడీ పనిచేస్తున్నారు. మోడీ ప్రధాని అయ్యాక దేశం ఆర్థిక రక్షణ రంగంలో బలంగా తయారైందనీ, కావున ప్రజలందరూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పరిపాలనకు మద్దతు తెలిపుటకు భారతీయ జనతా పార్టీ సభ్యత్వం తీసుకొని మద్దతు తెలపాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి నాయకులు కొత్తూరి వేంకటేశ్వర్లు, నరి నాయక్, కాటూరి శేషగిరి, మంద చిన్న లాసర్, ఉట్ల నాగేశ్వర్ రావు, కొత్తపల్లి శ్రీనివాస రావు, కూరపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ





**– రజకార్లను తరిమికొట్టిన ఘనత తనది**
**– రజకాలతో పోరాట ఫలితమే తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి**
**– మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి**

ఆత్మకూరు, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): మక్తల్ నియోజకవర్గ పరిధిలోని నర్వ మండల కేంద్రంలో తొలితరం తెలంగాణ ఉద్యమకారిని చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలు మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి మక్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి తరం పోరాట వీరవనిత రజకాలను తరిమికొట్టిన ఘనత దొరల గాడిదలను బద్దలు కొట్టారని ఆమె స్ఫూర్తితో తెలంగాణ తొలి ఉద్యమం జరిగిందని ఆమె ఆశయాలను కొనసాగించి సమ సమాజం స్థాపించాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలోఇట్టి కార్యక్రమంలో రజక సంఘ జిల్లా నాయకులు తిరుపతయ్య, సంజన, జగన్నాథం, బొజ్జన్న, బాబు, లంకాల అంజి, లక్ష్మణ్ గోపి, భీమేష్, రవి, శ్రీనివాసరావు, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ కేయు కమిటీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలు

**♦ ముఖ్యఅతిథిగా హాజరైన కేయు లెక్చరర్ ఆకుతోట శ్రీనివాస్**



హన్మకొండ కేయు, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకతీయ యూనివర్సిటీ లెక్చరర్ ముఖ్య అతిదిగా ఆకుతోట శ్రీనివాసుస్ అలాగే ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ పేరు వినగానే మన అందరికీ గుర్తుకు వచ్చే గొప్ప విషయం తాను ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన వీరవనితగా చెప్పవచ్చు. భూ పోరాటానికి నాంది పలికిన వీరనారి. ఆధునిక సామాజిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి. సామాన్య కుటుంబంలో వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కిష్టాపురం గ్రామంలో సెప్టెంబరు 26న జన్మించింది. ఓరుగంటి మల్లమ్మ, తండ్రి సాయిలుకు నాలుగవ సంతానం. పాలకుర్తి కి చెందిన నర్సయ్యతో బాల్య వివాహం జరిగింది. తన కుటుంబం ఆర్థికంగా వెనుకబడి ఉండడంతో చాలా కష్టాలు అనుభవించింది. 1940 నుండి 1944 మధ్య కాలంలో రజాకార్ల అరాచకంపై వ్యతిరేకంగా పోరాడి ఎర్ర జెండా పట్టింది. భూమి నాది పండించిన పంట నాది తీసుకెళ్లడానికి దొరెవ్వడు అంటూ తన మాటలను తూటాలుగా మార్చి దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రైతాంగ విప్లవాగ్ని చాకలి ఐలమ్మ. గారు అన్నారు వారి యొక్క పోరాట వరసత్వాన్ని నేటితరం యువత విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని కొనసాగించాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు పురుషోత్తం సాయి కుమార్ యూనివర్సిటీ ఉపాధ్యక్షురాలు పరిమళ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో విద్యార్థులు హక్కుల కోసం పోరాడాలి

**– పోరాటాల ద్వారానే మన హక్కులను సాధించుకోగలం**
**– డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రవణ్**



హన్మకొండ, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణ వీరవనిత, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మహిళా లోకానికి స్ఫూర్తి అయిన చిట్యాల ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా కేసముద్రం మండలంలో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలలో డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆ సంఘ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో విసునూరు రామచంద్ర రెడ్డి, అయన గుండాలు చేస్తున్న ఆగడాలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన మహోత్తరమైన పోరాటాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకొనీ వారి హక్కుల కోసం పోరాడాలని, భూమికోసం, భుక్తి కోసం, విముక్తికోసం సాగిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చిట్యాల ఐలమ్మది కీలక పాత్ర అని అలాంటి చాకలి ఐలమ్మ పోరాట చరిత్రను, వారి త్యాగంతో పాటు, దేశ స్వాతంత్ర ఉద్యమంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో, ప్రత్యేక తెలంగాణ తొలి, మలి దశలలో పోరాటం చేసి వారి ప్రాణాలను అర్పించిన ఎందరో మహనీయుల చరిత్రను తెలుసుకొని వారి ఆశయ సాధనకు కృషి చేయాలనీ వారన్నారు. అలాగే ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ కాకతీయ యూనివర్సిటీ జేఏసీ నాయకులు మంద విక్రమ్ మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ ఒక కులం కోసమో, మతం కోసమో పోరాడలేదని ఆనాడు వెట్టిచాకిరీకి బలవుతున్న ప్రజలను విముక్తి చేయాలనీ, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా పోరాడుతు ప్రజలందరి కోసం పోరాడారని వారు గుర్తు చేశారు. అలాగే ఈ కార్యక్రమంలో టీచర్లు విద్యార్థులు పాల్గొని మాట్లాడారు.

## అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి సహకరించండి



**– ఎంవి రామన్ స్కూల్ అధినేత డాక్టర్ మొగిలి శ్రీధర్ గౌడ్**

ఆత్మకూర్, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ శ్రీ శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ పనులు సర్వాంగ సుందరంగా కొనసాగుతున్నాయని నిర్మాణ పనులకు ప్రతి ఒక్కరు విరాళాలు అందించి సంపూర్ణంగా సహకరించాలని ఎంవి రామన్ హై స్కూల్ అధినేత మాజీ ఎంపీపీ డాక్టర్ మొగిలి శ్రీధర్ గౌడ్ కోరారు. ఈ సందర్భంగా వారు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి సుజాత, ఎంపీఓ శ్రీరామ్ రెడ్డి,కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ లతోపాటు పలువురుతో సమావేశమై అయ్యప్ప స్వామి వారి ఆలయ నిర్మాణ పనుల నిమిత్తం సహకారం అందించాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో నిర్వాహకులు జిన్నారం శ్రీనివాసులు, దివాకర్, కూరగాయల రఘు, భారత్ స్థానికులు ఆనంద్ గౌడ్, మహమ్మద్ బురుజు భీమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెండవ రోజు కొనసాగిన స్వచ్ఛ్ హై సేవా కార్యక్రమం



**– పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణ బాబు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకున్నప్పుడే ప్రజల ఆరోగ్యాలు బాగుంటాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణ బాబు అన్నారు. గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన స్వచ్ఛ్ హై సేవా కార్యక్రమంలో జడ్జి పాల్గొని కోర్టు సిబ్బంది మరియు న్యాయవాదులతో కలిసి పరిసరాలను శుభ్రపరిచినారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి మరియు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. రామచంద్రా రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏదులాపురం శ్రీనివాస్, న్యాయవాది కనపర్తి కవిత, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## వయోవృద్ధుల వారోత్సవాలను విజయవంతం చేయాలి



**జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్**

ములుగు జిల్లా, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): వచ్చే నెల 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న వయోవృద్ధుల వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. కోరారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్లో వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్ ను కలెక్టర్ దివాకర టి . ఎస్. ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని వృద్ధాశ్రమాల్లో వయోవృద్ధులకు ఆటల పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి నిర్వహిస్తున్నామని, వృద్ధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని మానసిక ఉల్లాసం పొందాలని సూచించారు. వయోవృద్ధుల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, గ్రాండ్ పేరెంట్స్ డే, వాక్ థాన్ కార్యక్రమాల్లో వృద్ధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి, ఇన్చార్జి శిరీష, వయోవృద్ధుల సంక్షేమ సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# నగర నలు వీధుల శుభ్రతకు మూల కారణం మీరు

**– మీ ఆరోగ్యమే మా అభిలాష**

**– జిడబ్ల్యూఎంసీ కార్మికులతో ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్**






వరంగల్, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): వరంగల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో స్వచ్ఛతాహి ఈ సేవ 2024లో భాగంగా బల్దీయ ఆధ్వర్యంలో ప్రతిమ కాన్సర్ ఇన్సిట్యూట్ సహకారంతో ఏర్పటి చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి జిడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తనాజీ వాకాడే నిత్యం మహానగర పరిశుభ్రం కోసం అహర్నిశలు శ్రమించే కార్మికుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక ద్రుష్టి ఉ టుందని ఎమ్మెల్యే అన్నారు. కార్మికులకు మెడికల్ కిట్ లను మరియు మెడికల్ కార్డు లను పంపిణి చేశారు.కార్మికులతో పాటు ఎమ్మెల్యే పరీక్షలు చేయించుకున్నారు. కార్మికులందరికి వైద్య పరీక్షలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం పరిచిన ఎమ్మెల్యే నాయిని. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైద్యులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలు

**– ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలి**

**– ఘనంగా చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలు**

**– పూల మాలలు వేసి నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్**



ములుగు జిల్లా, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): భూమి కోసం భుక్తి కోసం.. బానిస సంకెళ్ల విముక్తి కోసం జరిగిన పోరాటంలో నిప్పుకణికగా నిలిచి ఆడది అబల కాదు సబల అని నిరూపించిన వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలు ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్ లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ 129 వ జయంతి ఉత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బహుజన చైతన్యానికి, మహిళా శక్తికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ 129వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం అధికారికంగా జరపడం సంతోషాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనలో మగ్గుతున్న తెలంగాణలో తొలి భూ పోరాటానికి, సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన ధైర్యశాలి చాకలి ఐలమ్మ గారని అన్నారు. దొరల దాష్టీకానికి ఎదురుతిరిగి తన పంట గింజలు రక్షించడమే కాకుండా, నాటి నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ఎందరికో స్ఫూర్తిగా నిలిచి, తెలంగాణ సాయుధ పోరాటంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న పోరాట యోధురాలు చాకలి ఐలమ్మని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. ఆమె తెగువ, పౌరుషం తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చాటి చెప్పాయని పేర్కొన్నారు. తెలంగాణ పౌరుషాన్ని, పోరాటాన్ని, త్యాగాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన గొప్ప పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని కొనియాడారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని పునికి పుచ్చుకుని ప్రతీ ఒక్కరూ ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమములో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రవీందర్ రెడ్డి, బిసి సంఘ నాయకులు, సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శం

## దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి



దేవరకద్ర, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమని, ఐలమ్మ పోరాట స్ఫూర్తినే తెలంగాణ ఉద్యమానికి ప్రేరణగా నిలిచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో కొత్తకోట రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో ఐలమ్మకి నివాళులర్పించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటమే మాజీ ప్రధాని ఇందిరా గాంధీకి స్ఫూర్తిగా నిలిచి ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు భూములు పంచిందని తెలిపారు. ఎవరు కోరకుండానే ఐలమ్మ పోరాట పటిమ గుర్తించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా యూనివర్సిటీ ఐలమ్మ పేరు పెట్టారని, ప్రభుత్వంలో వారి కుటుంబాన్ని భాగ్యస్వామ్యం చేసేందుకు వారి మనమరాలిని మహిళా కమిషన్ సభ్యురాలుగా నియమించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే ఇద్దరు రజక సోదరులు గతంలో బసవరాజు సారయ్య , ప్రస్తుతం వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యేలుగా గెలుపొందారని తెలిపారు.రజకులను ఎస్సీ లో చేర్చే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలియజేశారు. అదేవిధంగా కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో రజక కమ్యూనిటీ హాల్ ప్రహరీ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే నిధుల నుండి తక్షణమే ఐదు లక్షలు రూపాయలను మంజూరు చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు అభిమానులు అధికారులు పాల్గొన్నారు.

# ఏ.ఎన్.ఎం లు అమ్మ కోసం యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలి





## జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): గురువారం ఐడిఓసికార్యాలయం లోని డి.ఎం అండ్ హెచ్.ఓ కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏ.ఎన్.ఎం లతో సమావేశం నిర్వహించి అమ్మకోసం యాప్ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో డి.ఎం అండ్ హెచ్.ఓ డాక్టరు మధుసూదన్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఏఎన్ఎం అమ్మ కోసం ఆప్ ను డౌన్లోడ్ చేసుకొవలని అమ్మకోసం యాప్ ద్వారా హైరిక్స్ గర్భిణీ స్త్రీల మేనేజ్మెంట్ ప్రోటోకాల్స్ తెలియజేయడం జరుగుతుందని ప్రతి 20 రోజులకు ఒకసారి ఈ యాప్ ద్వారా వివరాలు తెలియజేయడంచేయడం జరుగుతుందని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు బాధపడుతున్నటువంటి రక్తహీనత, రక్తపోటు (హైపర్ టెన్షన్), డయాబెటిస్, జాండీస్, గర్భిణీ సమయంలో పసకలు, క్షయ వ్యాధి, జ్వరము, హెచ్ఐవి, మెంటల్ హెల్త్, పిండం బరువు పెరగకపోవడం, ఫిట్స్, బ్లీడింగ్ విత్ 20 వీక్స్, మొదలగునటువంటి ప్రమాదకరమైన పరిస్థితుల నుండి గర్భిణీ స్త్రీలను ఎలా రక్షించాలి అనే పద్ధతులను ప్రతి 20 రోజులకు ఒకసారి ఈ యాప్ ద్వారా ఏఎన్ఎం లకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యాప్ ట్రైనింగ్ డాక్టర్ రోహిణి డాక్టర్ మౌనిక, పి ఓ ఎం సి హెచ్ డాక్టర్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

# శ్రమ దోపిడీకి ఎదురొడ్డి నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ

## అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): శ్రమ దోపిడీకి ఎదురొడ్డి నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ ని తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు సామాజిక ఆధునిక పరిమాణానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి చాకలి ఐలమ్మ అని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ కొనియాడారు. గురువారం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథులుగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ లు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రెవెన్యు అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కొంగు నడుముకు చుట్టి, కొడవలి చేపట్టి నైజాం సర్కార్తో పాటు విస్నూర్ దొరల ఆగడాలను ఎదిరించిన వీరనారి చాకలి ఐలమ్మ అన్నారు. ఆనాడు నిరంకుశ రజాకార్లను దేష్ముఖ్ లకు వ్యతిరేకంగా మొక్కవోని ధైర్యం పోరాడిన న వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ వీరవనిత ధైర్య





శాలిగా పేరు గాంచిందన్నారు. భూమి కొరకు, భుక్తి కొరకు, వెట్టిచాకిరీ విముక్తి కొరకు జరిగిన సాయుధ పోరాటంలో దొరలు, రజాకార్ల దురాగతాలను ఎదిరించిన గొప్ప వీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. వెనుకబడిన తరగతుల రజక కులంలో పుట్టిన భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం శ్రమ దోపిడిని అరికట్టేందుకు 75 ఏళ్ల క్రితమే అన్యాయాన్ని ఎదిరించి పోరాడాలని ఆలోచించిన ధీరవనిత వీరనారి ఐలమ్మగా పేర్కొన్నారు. ప్రజాస్వామ్య బద్దంగా మన సమస్యలకు పరిష్కారం రాబట్టుకోవాలని అన్నారు. రజక సంఘ ప్రతినిధులు కోరిన అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి నరసింహస్వామి, మునిసిపల్ ఛైర్మెన్ డాక్టర్ పాల్వాయి రాం మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, జిల్లా ఉద్యాన శాఖ అధికారి జీనుగు మరియన్న, గ్రౌండ్ వాటర్ అధికారి సురేష్, సి.పి.ఐ.ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ అజయ్ సారథి, నిమ్మల శ్రీనివాస్, కొలిపాక వెంకన్న, ఉప్పలయ్య, గోపాల్, మామిడాల సత్యనారాయణ, చాగంటి కిషన్,రజక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల కష్టపడి ఉన్నత స్థానాలు సాధించాలి

## వనపర్తి జిల్లా డిఐఈఓ ఏ.అంజయ్య గౌడ్




ఆత్మకూరు, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులు ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఏ.అంజయ్య గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి భవిష్యత్తులో ఉన్నత స్థానాలు సాధించాలని విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనడం అవసరమని సూచించారు. వరద బాధితుల సహాయం నిధి సేకరణలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆత్మకూరు కళాశాల జిల్లాలోని ప్రథమ స్థానంలో నిలిచినందుకు



డిఐఈఓ కళాశాలను మరియు అధ్యాపకులను సేకరించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ భాగ్య వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులే ఎక్కువగా ఉత్తీర్ణులు అవుతారని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఇట్టి కార్యక్రమంలో కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నరేంద్ర కుమార్, పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ భద్ర సేన, రిటైర్డ్ ప్రిన్సిపల్ డి ఎస్ రాజేశ్వరరావు, కళాశాల సీనియర్ అధ్యాపకులు టీజే.విశ్వేశ్వర్ అధ్యాపకులు జమ్మన్న, రాఘవేంద్రరావు, శ్వేతా, లతమ్మ, కురుమూర్తి, చైతన్య, రాణి, పావని, సునీల్, రాఘవేంద్ర, బుచ్చయ్య బాలకృష్ణ, రామన్ గౌడ్, సతీష్, విమల కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో జోరుగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

## భాజపా మెగా మెంబర్షిప్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్న చల్ల శ్రీలతరెడ్డి





నేరేడుచర్ల, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల మండలంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా కొనసాగుతోంది. భారతీయ జనతా పార్టీ మెగా మెంబర్షిప్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా హుజూర్నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల మండల కేంద్రంలో మండల అధ్యక్షులు పార్ధనబోయిన విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ మెగా మెంబర్షిప్ డ్రైవ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర నాయకురాలు, సూర్యాపేట జిల్లా సభ్యత్వ ప్రముఖ్, హుజూర్నగర్ నియోజకవర్గ ఇన్చార్జి చల్ల శ్రీలతరెడ్డి హాజరై వార్డు ప్రజలకు భారతీయ జనతా పార్టీ సభ్యత్వం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో సభ్యత్వ కార్యక్రమం వేగంగా నడుస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో తెలంగాణ ప్రజలు భారతీయ జనతా పార్టీని ఆదరిస్తున్నారని తెలిసిపోయిందని , అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా 88 00 00 2024 కు మిస్డ్ కాల్ ఇచ్చి భారతీయ జనతా పార్టీలో చేరుతున్నారన్నారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 10 సంవత్సరాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బడుగు బలహీన వర్గాల కొరకు పనిచేస్తున్నారని పేద ప్రజల సంక్షేమం కొరకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని, కరోనా ఆపద సమయంలో దేశ ప్రజలందరికీ ఉచిత వ్యాక్సినేషన్ ఇప్పించి వారి ప్రాణాలను కాపాడడం జరిగిందన్నారు. భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టడానికి నిరంతరం ప్రధానమంత్రి మోడీ పనిచేస్తున్నారని, మోడీ ప్రధాని అయ్యాక దేశం ఆర్థిక రక్షణ రంగంలో బలంగా తయారైందనీ, కావున ప్రజలందరూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలనకు మద్దతు తెలిపుటకు భారతీయ జనతా పార్టీ సభ్యత్వం తీసుకొని మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బూత్ అధ్యక్షులు పల్లెపంగ వీరబాబు, దిద్దకుంట్ల విజయ్ రెడ్డి, గొడ్డేటి పవన్ కుమార్, నందిపాటి హిందూజా, రాము తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ

కామారెడ్డి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ 129 వ జయంతి వేడుకల సందర్భంగా గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ ఆతిథి గృహం ముందు గల చాకలి ఐలమ్మ విగ్రహానికి టిఆర్ఎస్ పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎంకే ముజిబొద్దీన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ప్రజల కోసం పోరాటం చేసిన గొప్ప పోరాట యోధురాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జాకంటి ప్రభాకర్ రెడ్డి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పిప్పిరి వెంకటి, గైని శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు నజీరోద్దిన్, హఫీజ్ బెగ్, గెరిగంటి స్వప్న లక్ష్మినారాయణ, కృష్ణజిరావు, కాసర్ల స్వామి, యూత్ పట్టణ అధ్యక్షుడు చిలిమెల భానుప్రసాద్ మరియు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జగదీష్ యాదవ్, కొత్తింటి శ్రీనివాస్ రెడ్డి,నరేష్ రెడ్డి, గోపు నర్సింలు, మనూసుర్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ వర్కర్స్ కు చెకప్ క్యాంప్



## స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో

ఆత్మకూరు, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం రోజు ఆత్మకూరు మండల ఆయా గ్రామాల పంచాయతీ వర్కర్స్ 57 మందికి హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించారు. సబ్బులు,బట్టల సబ్బులు,కొబ్బరి నూనె,వస్తువులు బూట్లు,బ్లౌజులు గ్రామపంచాయతీ వర్కర్స్ కి ఎంపీడీవో సుజాత, ఎంపీవో శ్రీరాంరెడ్డి పర్యవేక్షణలో ఫైట్ ఇవ్వబడిన వస్తువులు మరియు మందుల పంపిణీ కార్యక్రమాలు క్యాంపుల ద్వారా పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ వర్కర్స్ లో ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు.

# స్వచ్ఛహే సేవ కార్యక్రమంలో మల్టీ పర్పస్ వర్కర్లకు ఆరోగ్య పరీక్షలు



నేరేడుచర్ల, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): స్వచ్ఛహే సేవ కార్యక్రమంలో భాగంగా నేరేడుచర్ల మండలంలోని, కందులవారి గూడెం గ్రామపంచాయతీలో గురువారం నాడు మల్టీ పర్పస్ వర్కర్స్ కు హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వారి యొక్క రక్త నమూనాలు సేకరించి , బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించిన అనంతరం వారికి తగిన మందులు, సలహాలు, పాటించ వలసిన ఆహార నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించడం జరిగింది. ఈ యొక్క హెల్త్ క్యాంపు కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి టి. శివకృష్ణ, పిహెచ్సి హెల్త్ అసిస్టెంట్ లు హరికృష్ణ, లీనా మరియు ఆశ వర్కర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమల లడ్డూ అపవిత్రతకు కారకులను కఠినంగా శిక్షించాలి

**– బీజేపీ మాజీ మండల అధ్యక్షులు జంగ భగవంతు యాదవ్**



పెబ్బేరు, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడటంపై గతంలో ఉన్న జగన్ ప్రభుత్వాన్ని శిక్షించాలని బీజేపీ నేత పెబ్బేరు మండల బీజేపీ మాజీ మండల అధ్యక్షులు జంగ భగవంతు యాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం ఉందని, లడ్డూ అపవిత్రతకు కారణం అయిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బ తీశారని, పవిత్ర లడ్డూను వ్యాపార కోణంలో చూశారని మండిపడ్డారు.లడ్డూపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరపాలని,ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై మాకు పూర్తిగా నమ్మకం ఉందని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వారిపై సీబీఐ దర్యాప్తు కూడా జరపాలని, హిందూ దేవాలయాల్లో హిందువులనే నియమించాలని అన్నారు.లడ్డూ అపవిత్రం అంటే హిందువులపై దాడేనని.. పథకం ప్రకారమే లడ్డూ పవిత్రతను దెబ్బ తీశారని అన్నారు

# వయోవృద్ధులకు అందరూ సహకరించాలి

**జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్.**

జగిత్యాల: వయోవృద్ధులకు అన్ని తరాల వారు సహకరించాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు.బుధవారం ఓల్డ్ హైస్కూలు ఆవరణలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయో వృద్ధుల వారోత్సవాల పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.అనంతరం సీనియర్ సిటిజెన్లు,అన్ని వర్గాల వారితో వయో వృద్ధుల ఆరోగ్య సంరక్షణ,సామాజిక భద్రత,చట్టపరమైన రక్షణ కల్పించడానికి తోడ్పాటు అందిస్తామని కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి బి.నరేశ్,డి.వి.ఓ.రగువరన్,మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య,,సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు హరి ఆశోక్ కుమార్,గౌరిశెట్టి విష్వనాథం,వెల్ముల ప్రకాష్ రావు, కాశీనాథం, ఎం.డి.యాకూబ్,సయ్యద్ యూసుఫ్,దేవేందర్ రావు,ఎం.డి ఎక్బాల్,గంగం జలజ,సఖి కోఆర్డినేటర్ జాన్సన్,తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**గ్రామ గ్రామాన జోరుగా బిజెపి సభ్యత్వ నమోదు**

**బిజెపి సీనియర్ నాయకులు కంబలాపురం రాము**



ఆత్మకూర్, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా తిప్పడంపల్లి గ్రామంలో గురువారం రోజు విశేష్ సంపర్కు అభియాన్ కార్యక్రమంలో భాగంగా జోరుగా బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఇట్టి కార్యక్రమానికి బిజెపి సీనియర్ నాయకులు కంబలాపురం రాము ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి సభ్యత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామ గ్రామాన బిజెపి సభ్యత్వ నమోదు జోరుగా జరగాలని స్థానిక సంస్థల ఎన్నికల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పార్టీకి కట్టుబడి ఉండాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటింటికి చేరే వేసే విధంగా కార్యకర్త పనిచేయాలని, పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. అనంతరం ఆయన స్వయంగా కార్యకర్తలతో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. బిజెపి పార్టీ గ్రామ అధ్యక్షులు బాలరాజు, కావటి శాంతన్న, బొల్లి శాంతన్న, తెలుగు రాములు, నాగరాజు మరియు మారమోని తిరుపతి పాల్గొన్నారు.

# సాయుధ పోరులో దొరలను గడగడ లాడించిన వీర వనిత చాకలి ఐలమ్మ

**– సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్**



పాలకవీడు, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): గురువారం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా పాలకీడు మండల కేంద్రంలో ఉన్న ఐలమ్మ విగ్రహానికి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈ అనంత ప్రకాష్ మాట్లాడుతూ దొరల ఆగడాలకు రజాకార్ల అకృత్యాలకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం విదేయోచితమైన పోరాటం నిర్వహించిన గొప్ప వీరనారి చాకలి ఐలమ్మ అని ఆయన కొనియాడారు దాని ఫలితంగా నాలుగు లక్షల ఎకరాల భూమిని పంపిణీ జరిగిందని ఆయన అన్నారు. ఆమె విరోచితమైన పోరాట స్ఫూర్తి స్ఫూర్తితో పనిచేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ పగడాల మట్టేస్ కొండ ఎల్లయ్య బీసీ సంఘం నాయకులు కొండా శ్రీను బ్రహ్మచారి రజక సంఘం నాయకులు పొదిల సైదులు వెంకన్న వెంకయ్య వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం

**కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్**



హన్మకొండ, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని నాయకులు నార్లగిరి రమేష్ అధ్యక్షతన గురువారం రోజున బాలసముద్రం లోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయం లో నిర్వహించారు. ఈ సందర్భంగా సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతా%శీ%గ పోరాట యోధురాలు వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. బహుజన పోరుబిడ్డ, నిజాం నియంత్రత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వీరవనిత, ఓరుగల్లు పోరుబిడ్డ అని అన్నారు. దున్నేవాడికి భూమి దక్కాలని, పండించే వాడికే పంట దక్కాలని పోరాడిన ఉద్యమ వీరవనిత ఐలమ్మ అని తెలిపారు. బహుజన ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ అని అన్నారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, మాజీ కార్పొరేటర్లు కుసుమ లక్ష్మీనారాయణ, ఉడుతల సారంగపాణి, డివిజన్ అధ్యక్షులు కనకరాజు, శ్రీనివాస్, హరినాథ్, మోహన్, రాజు, నాయకులు సుంచు కృష్ణ, సల్వాజీ రవీందర్ రావు, పరుశురాములు, రాజు, శ్రీనివాస్, శ్రీధర్ రావు, జానకిరాములు, రమేష్, అఫ్జల్, దేవి, రామ్మూర్తి, గంద్రకోట రాకేష్ యాదవ్, నగేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# 26 నుంచి ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభం

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభమైంది. సెప్టెంబర్ 26 నుంచి మొదటి రౌండ్ అడ్మిషన్లకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించనున్నారు. సెప్టెంబర్ 24న కన్వీనర్ కోటా సీట్ల కోసం మొత్తం 16,679 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ప్రాథమిక మెరిట్ జాబితాను కాళోజీ ఆరోగ్య యూనివర్సిటీ విడుదల చేసింది. ఈ జాబితాపై అభ్యంతరాలుంటే సెప్టెంబర్ 25 సాయంత్రం ఐదు గంటల్లోపు వెబ్‌సైట్ ద్వారా తెలియజేయాలని కాళోజీ వర్సిటీ వైస్ ఛాన్సలర్ బి కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఈ రోజు ముగింపు సమయంలోపు వచ్చే అభ్యంతరాల పరిశీలన అనంతరం సెప్టెంబర్ 26వ తేదీన తుది మెరిట్ జాబితాను విడుదల చేస్తారు. ఇక అదేరోజు వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ కూడా ప్రారంభమవుతుంది. ఈ మేరకు విద్యార్థులు అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. గత ఏడాదికి సంబంధించిన సీట్ల కేటాయింపు వివరాలు కాలేజీల వారీగా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు.కాగా రాష్ట్రంలోని 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 4,090 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. వాటిలో 15 శాతం సీట్లు ఆలిండియా కోటాలో భర్తీ అవుతాయి. మిగిలిన అన్ని సీట్లు రాష్ట్ర విద్యార్థులకు కౌన్సెలింగ్‌లో అందుబాటులో ఉంటాయి. ఇక ప్రైవేట్ కాలేజీల్లో మరో 4,810 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో సగం కన్వీనర్ కోటాలో భర్తీ అవుతాయి. మిగిలినవి బీ, సీ కేటగిరీ సీట్లుగా అందుబాటులో రానున్నాయి.

ఇంటర్‌కు ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివితే మాత్రమే స్థానికులుగా గుర్తించేలా జారీ చేసిన జీవో 33పై కొందరు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కోసం దరఖాస్తు చేసుకునే వారి స్థానికతకు సంబంధించిన మార్గదర్శకాలను కొత్తగా రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ఇంటర్ తర్వాత నాలుగేళ్లు రాష్ట్రంలో చదవకపోయినా అనుమతిస్తున్నట్లు అత్యున్నత ధర్మాసనం ఎదుట రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు గత సెప్టెంబర్ 27 కౌన్సెలింగ్ ప్రక్రియకు అనుమతిస్తూ, కోర్టును ఆశ్రయించిన 135 మంది విద్యార్థులకు కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పించినట్లైంది. సుప్రీంకోర్టు తీర్పుపై న్యాయశాఖ సమీక్ష, సూచనల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కౌన్సెలింగ్‌కు అనుమతించింది. ఈ నేపథ్యంలో కోర్టును ఆశ్రయించిన 135 మంది విద్యార్థుల మెరిట్ జాబితాను ప్రత్యేకంగా విడుదల చేసింది.

# రుణమాఫీ కాలేదు... వడ్డీలు కట్టండి

హైదరాబాద్: తెలంగాణలో చాలామంది రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ఓవైపు ప్రభుత్వం రుణమాఫీ చేశామని.. చేస్తామని చెబుతోంది. మరోవైపు రుణ మాఫీ కాలేదు.. వడ్డీలు చెల్లించాలని బ్యాంకులు, సహకార సంఘాలు హుకుం జారీ చేస్తున్నాయి. దీంతో ఏం చేయాలో తెలియక రైతులు రోడ్డెక్కుతున్నారు. బ్యాంకుల ముందు ఇంకా బారులు తీరుతున్నారు.పంద్రాగస్టు లోపు రైతు రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఆగస్టు నెలాఖరులోగా రుణమాఫీ పూర్తవుతుందని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని మంత్రులు స్పష్టం చేశారు. కానీ.. ప్రభుత్వం చెప్పిన గడువు ముగిసి నెల రోజులు గడుస్తున్నా..సంపూర్ణ రుణ మాఫీ కాలేదు. జులై 18న అర్హులైన రైతుల ఖాతాల్లో రూ.1 లక్ష వరకు ఉన్న రుణాన్ని మాఫీ చేశారు. వడ్డీతో పాటు..లక్ష వరకు ఉన్న రుణం డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. జులై 31వ తేదీ నుంచి రూ.1.50 లక్షల రుణం ఉన్న రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పింది. జులై 31 వరకు మొత్తం 18 లక్షలకు పైగా రైతులకు లబ్ధి చేకూరిందని వివరాలు వెల్లడించింది. రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు తీసుకున్న రుణాలను ఆగస్టు 14 తేదీలోపు మాఫీ చేస్తామని ప్రకటించింది. దీనికి సంబంధించి రుణమాఫీ లిస్ట్ అధికారులు విడుదల చేశారు. కానీ.. అసలు సమస్య ఇక్కడే మొదలైంది. లక్షన్నర నుంచి రూ.2 లక్షల వరకు రుణం తీసుకున్న రైతులకు ఇంకా మాఫీ కాలేదు. దీంతో రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికీ వేలాది మంది రైతులకు సంపూర్ణ రుణమాఫీ కాలేదు. తీసుకున్న అప్పులకు వడ్డీలు చెల్లించాలని బ్యాంకులు, సహకార సంఘాలు రైతులపై ఒత్తిడి పెంచుతున్నాయి. దీంతో రైతులు బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తాజాగా.. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో రుణమాఫీ కాలేదని రైతన్నలు రోడ్డెక్కి ఆందోళన చేశారు. రుణమాఫీ కాలేదని, కొత్త రుణాల మంజూరులో బ్యాంకర్లు అలసత్వంవహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎస్బీఐ బ్యాంకు ముందు రోడ్డుపై బైఠాయించారు.

# జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఆర్టీఐ అవగాహన సదస్సు కరపత్రాలు విడుదల



నారాయణపేట జిల్లా, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): జిల్లా కేంద్రంలోని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎలిగండ్ల వెంకటేష్ ముదిరాజ్, నారాయణపేట అసెంబ్లీ ఇంచార్జ్ ఎడ్ల కురుమయ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 30 రోజున సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తరఫున నిర్వహించబోయే సమాచార హక్కు చట్టం-2005 అవగాహన సదస్సు సంబంధించిన కరపత్రాలను నారాయణపేట జిల్లా ఎస్పీ గౌరవనీయులు యోగేష్ గౌతమ్ చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట అసెంబ్లీ అధ్యక్షుడు గణేష్, అసెంబ్లీ నాయకులు సందకృష్ణ, చంద్రశేఖర్, బాలకృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



## కాంగ్రెస్ పార్టీ నాయకుల నివాళులు

పెబ్బేరు, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణ దిక్కర స్వరానికి నిలువుటద్దం, మహిళ లోకానికి స్ఫూర్తి ప్రదాత, వీర వనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు మహానీయురాలి విగ్రహానికి మార్కెట్ కమిటీ చైర్మన్ గౌని ప్రమోదిని పాండేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షులు కారుపాకుల వెంకట రాములు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటరమణ, సురేందర్ గౌడ్, వెంకటేష్ సాగర్, గంధం రంజిత్ కుమార్, యుగంధర్ రెడ్డి, దయాకర్ రెడ్డి పూలమాలలు వేసి గురువారం నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పాత్ర అత్యంత కీలకమని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంధం రాజశేఖర్, సురేందర్ గౌడ్, బానుప్రకాష్ రెడ్డి, శివకుమార్, సత్యనారాయణ, జగదీశ్వర్ రెడ్డి,మాజీ డైరెక్టర్ రాములు, సత్యనారాయణ రెడ్డి,ఎల్లస్వామి

# 4వ బెటాలియన్లో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



మామునూరు, సెప్టెంబర్ 26 (తీన్మార్ న్యూస్): నాలుగవ బెటాలియన్ లో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమాండెంట్ శ్రీ బి.రామ్ ప్రకాష్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కమాండెంట్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రజాకార్లకు వ్యతిరేకంగా భూమికోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని నేటి తరానికి ఆమె పోరాటాలు స్ఫూర్తిదాయకమని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణ ప్రసాద్, శ్రీనివాస్ రావు, వీరన్న, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శోభన్ ,వెంకటేశ్వర్లు , పురుషోత్తం రెడ్డి ,రవి ,రాజ్ కుమార్, అశోక్, కృష్ణ , అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు .

# అర్ధరాత్రి ఒంటిగంట వరకు హోటళ్లు.. రెస్టారెంట్లు

హైదరాబాద్: జిల్లాలోని రాచకొండ, సైబరాబాద్ పలు ప్రాంతాల్లో హోటల్స్.. రెస్టారెంట్స్ ఐస్ క్రీమ్ పాన్ దుకాణాలు, పనివేళలను ఇక నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు నిర్వహించుకోవచ్చని సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే సూపర్ మార్కెట్లు, బంగారు షాపులు, ఇతర కిరాణ దుకాణాలను ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే నిర్వహించు కోవచ్చు. దీనికి సంబంధిం చి ఉత్తర్వుల ను జారీ చేసింది ప్రభుత్వం. వైన్స్ లిక్కర్ అవుట్ లెట్స్ జీహెచ్ఎంసీ పరిధిలోకి వచ్చే షాపులు సమయాన్ని కూడా పొడిగించారు. ఈ దుకాణాలను ఉదయం 10గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్వహించు కోవచ్చని తెలిపింది. జీహెచ్ ఎంసీకి 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్న దుకాణాల నిర్వహణ వేళలు కూడా పెంచింది.

# పచ్చని కాపురంలో చిచ్చుపెట్టిన పోలీస్ కానిస్టేబుల్.

మహబూబ్ నగర్: నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి.. నాలుగు నెలల కిందట తన స్నేహితురాలితో కలిసి జర్నీ చేస్తున్నారు. ఈ క్రమంలో నాగర్ కర్నూల్‌లోని మెయిన్ రోడ్డు పక్కన కారు ఆపి.. దాంట్లో భోజనం చేస్తున్నారు. ఈ సమయంలో ఓ కానిస్టేబుల్ అటుగా వచ్చారు. కారులో ఉన్నవారి ఫొటోలు తీశారు. ఇక్కడ ఏం చేస్తున్నారని ప్రశ్నించి.. భయభ్రాంతులకు గురిచేశాడు. అంతటితో ఆగకుండా.. తన దగ్గర ఉన్న ట్యాబ్‌లో నుంచి ఫొటో తొలగించాలంటే రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే కేసు నమోదు చేస్తానని బెదిరించారు. దీంతో భయపడిన ఆ వ్యక్తి రూ.2 వేలు ఇచ్చేందుకు ఓకే చెప్పారు. వెంటనే తన స్నేహితుడి ఫోన్‌పేకి ఆ కానిస్టేబుల్ రూ.2 వేలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. అక్కడితో ఆగలేదు.కానిస్టేబుల్ తీసిన ఆ ఫొటోను తొలగించలేదు. కొన్ని రోజుల తర్వాత ఆ ఫొటోను బిజినేపల్లి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న మరో కానిస్టేబుల్‌కు పంపించారు. అతను కూడా ఫొటోతో బ్లాక్ మెయిల్ చేశాడు. డబ్బులు ఇవ్వాలని బాధితుడిని బెదిరించాడు. దీంతో చిరాకు వచ్చి.. బాధితుడు డబ్బులు ఇవ్వబోనని స్పష్టం చేశారు. దీంతో కానిస్టేబుల్ ఆ ఫొటోను బాధితుడి భార్యకు చూపించాడు. కానిస్టేబుల్ చేసిన ఈ పనితో.. భార్యాభర్తల మధ్య గొడవలు స్టార్ట్ అయ్యాయి. వీరి గొడవను పెద్దలు కూర్చొని సెట్ చేశారు. ఈ వ్యవహారం.. సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ ఘటన గురించి నాగర్ కర్నూల్ సీఐ కనకయ్యకు తెలిసింది. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. డబ్బులు వసూలు చేసినట్లు నిర్ధారణ అయితే.. ఆ ఇద్దరి కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకుంటామని సీఐ కనకయ్య స్పష్టం చేశారు.ఈ విషయం తెలిసి బిజినేపల్లి ప్రజలు భగ్గుమంటున్నారు. పోలీసులు మరీ ఇంత దిగజారిపోయారేంటని చర్చించుకుంటున్నారు. ఇదొక్కటే కాదు.. పోలీసులు డబ్బులు డిమాండ్ చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయని చెబుతున్నారు.

సదరు కానిస్టేబుళ్ల బాధితులు చాలామంది ఉన్నారని అంటున్నారు. పోలీసు శాఖ ఉన్నతాధికారులు స్పందించి.. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఏ రోజు ఏ బతుకమ్మ...

వరంగల్: తెలంగాణ ఆడబిడ్డలు భక్తి శ్రద్ధలతో సంబరంగా జరుపుకునే పండుగ బతుకమ్మ. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు జీవన విధానానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ వేళ తొమ్మిది రోజుల పాటూ తెలంగాణ వ్యాప్తంగా ఊరూ వాడా ఎక్కడ చూసినా సందడే. చిన్నా పెద్దా వేడుకలలో పాల్గొంటారు. ముచ్చటగా ముస్తాబై బతుకమ్మలు తయారు చేసి అంతా కలసి ఆడిపాడతారు. ఈ ఏడాది 2024 లో భాద్రపద అమావాస్య అక్టోబరు 02న వచ్చింది. ఈ రోజు ప్రారంభమయ్యే వేడుకలు తొమ్మిది రోజుల పాటూ వైభవంగా సాగి... అక్టోబరు 10 తో ముగుస్తాయి.

భాద్రపద అమావాస్య ( అక్టోబరు 02) నుంచి దుర్గాష్టమి ( అక్టోబరు 10) వరకూ బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు..

అక్టోబర్ 02 బుధవారం భాద్రపద అమావాస్య లేదా మహాలయ అమావాస్య

మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ మహాలయ అమావాస్య రోజు జరుగుతుంది.

అక్టోబర్ 03 గురువారం ఆశ్వయుజ శుక్ల పాడ్యమి - అటుకుల బతుకమ్మ

రెండో రోజు అటుకుల బతుకమ్మ నవరాత్రి కలశ స్థాపన రోజు జరుపుకుంటారు

అక్టోబర్ 04 శుక్రవారం ఆశ్వయుజ శుక్ల విదియ - ముద్దపప్పు బతుకమ్మ

మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ

అక్టోబర్ 05 శనివారం ఆశ్వయుజ శుక్ల తదియ - నానే బియ్యం బతుకమ్మ

నాలుగో రోజు నానేబియ్యం బతుకమ్మ

అక్టోబర్ 06 ఆదివారం ఆశ్వయుజ శుక్ల చవితి - అట్ల బతుకమ్మ

ఐదో రోజు అట్ల బతుకమ్మ

అక్టోబర్ 07 సోమవారం ఆశ్వయుజ శుక్ల పంచమి - అలిగిన బతుకమ్మ

ఆరో రోజు అలిగిన బతుకమ్మ - ఈ రోజు అమ్మవారికి నైవేద్యం సమర్పించరు

అక్టోబరు 08 మంగళవారం ఆశ్వయుజ శుక్ల షష్టి - వేపకాయల బతుకమ్మ

ఏడో రోజు వేపకాయల బతుకమ్మ

అక్టోబరు 09 బుధవారం ఆశ్వయుజ శుక్ల సప్తమి - వెన్నముద్దల బతుకమ్మ

ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మ

అక్టోబరు 10 గురువారం ఆశ్వయుజ శుక్ల అష్టమి ( దుర్గాష్టమి) -సద్దుల బతుకమ్మ

బతుకమ్మ పండుగలో తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ జరుపుకుంటారు. ఈ రోజు బతుకమ్మలను గడిచిన రోజుల కన్నా పెద్ద పరిమాణంలో తయారు చేస్తారు. ఈ రోజు ఆఖరి రోజు కావడంతో సంబరాలు అంబరాన్నంటుతాయి. భారీ బతుకమ్మలు తయారు చేసి ఆడిపాడిన తర్వాత.. తీసుకెళ్లి నిమజ్జనం చేస్తారు. ఈ వేడుక దుర్గాష్టమి రోజు జరుపుకుంటారు. బతుకమ్మ పండగ తెలంగాణలో ఎప్పుడు ప్రారంభమైందో చెప్పేందుకు సరైన ఆధారాలు లేవు కానీ వేల ఏళ్లుగా కొనసాగుతోందని చెప్పేందుకు చాలా కథలున్నాయి. దీని వెనుక ఎన్నో కథలు చెబుతారు. జగన్మాత మహిషాసురుడిని చంపిన తర్వాత అలసటతో మూర్ఛపోయిందట. ఆమెను మేల్కొలిపేందుకు స్త్రీలంతా గుమిగూడి ప్రార్థించారట. బతుకమ్మా అంటూ పాటలు పాడారట.. పదో రోజు ఆమె నిద్రలేచిందని అప్పటి నుంచి బతుకమ్మ వేడుక జరుపుకుంటున్నారని ఓ కథనం ప్రచారం లో ఉంది. ఈ వేడుకలో అలిగిన బతుకమ్మ రోజు మినహా మిగిలిన రోజుల్లో అమ్మవారికి రోజుకో రకమైన నైవేద్యం సమర్పిస్తుం టారు. ఈ వేడుకల్లో పాల్గొనే తెలంగాణ ఆడబిడ్డలను చూసేందుకు రెండు కళ్లు సరిపోవు...

# బంగాళాఖాతంలో అల్పపీడనం

## తెలంగాణలోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు

హైదరాబాద్: పశ్చిమ మధ్య బంగాళాఖాత ప్రాంతంలోని ఉపరితల ఆవర్తనం, దక్షిణ కోస్తా, మయన్మార్ ప్రాంతాలలో ఉపరితల ఆవర్తనం తూర్పు-పశ్చిమ ద్రోణితో కలిసి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంటుందని వాతావరణ కేంద్ర తెలిపింది. ఎత్తుకు వెళ్ళేకొలది నైరుతి దిశగా వంగి ఉంటుందని, దీని ప్రభావంతో నేటి నుంచి మరో మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు.అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయి. నిర్మల్, నిజామాబాద్, సూర్యాపేట, నల్గొండ, మహబూబాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, మహబూబ్ నగర్, జోగులాంబ గద్వాల్ జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. గంటకు 30-40 కి.మీ వేగంతో ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులు వీచనున్నాయి. ఉమ్మడి నిజామాబాద్, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్, వరంగల్, హనుమకొండ, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నల్గొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచనున్నాయి. బుధవారం నాడు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు చాలా చోట్ల కురిసే అవకాశం ఉంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ లో వాతావరణం పొడిగా ఉంటూ ఒక్కసారిగా మారిపోతుంది. మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్, ఆదిలాబాద్, కొమురంభీం -ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్గొండ, సూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షం కురవనుండగా.. కొన్నిచోట్ల మోస్తరు వానలు పడతాయని వాతావరణశాఖ అంచనా వేసింది. మంగళవారం ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ ఒ యానాంలో, దక్షిణ కోస్తాలో వర్షాలు కురవనున్నాయి. తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడతాయి. లేకపోతే పలుచోట్ల ఉరుములతో కూడిన జల్లులకు అవకాశము ఉంది. ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురవనున్నాయి. గంటకు 30-40 కిలోమీటర్ల వేగముతో గాలులు వీచే అవకాశముంది. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలున్నాయి. ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశంలో కొన్నిచోట్ల తేలికపాటి వర్షం కురవనుంది. రాయలసీమలోనూ గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి జల్లులు పడతాయి. కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, జిల్లాల్లో సెప్టెంబర్ 24న అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# చెరువుల వద్ద సీసీటీవీలు

హైదరాబాద్: హైదరాబాద్‌లో ఆక్రమిత చెరువులు, నాలాల వద్ద అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తోంది. మరోవైపు మూసీ పరివాహక ప్రాంతాల పరిధిలో నివసించే అర్హులైన పేదల వివరాలను సేకరించాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హులైన పేదలు రోడ్డున పడకూడదని, అలాంటి వారికి డబుల్ బెడ్రూమ్ లేదా ఇతర ప్రత్యామ్నాయం చూపించాలని సూచించారు. చెరువుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ తో అనుసంధానం చేయాలని సూచించారు. హైడ్రా చేపడుతున్న కార్యక్రమాలు, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు, మెట్రో రైలు విస్తరణ వంటి అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు రేవంత్ రెడ్డి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. చెరువుల వద్ద భూములు ఆక్రమణకు గురికాకుండా చూడటంలో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువుల పరిరక్షణ ఒక బాధ్యతగా చేపట్టాలని.. చెరువులు, నాలాలు ఆక్రమణలకు గురికా కుండా చర్యలు చేపట్టాలన్నారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న చెరువులు, కుంటలు, జలశయాలు అన్నింటికీ ఎఫ్టీఎల్ (ఈబఒ), బఫర్ జోన్లను గుర్తించడంతో పాటు ప్రతీ చెరువు, నాలాల ఆక్రమణల వివరాలతో పూర్తి స్థాయి నివేదికను తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీ కి మెట్రో మార్గానికి సంబంధించి పూర్తి స్థాయి నివేదికను రూపొందించాలని అధికారులకు సీఎం సూచించారు. ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణ పనులను వేగంగా చేపట్టాలన్నారు. మెట్రో రైలు మార్గాలకు సంబంధించిన భూ సేకరణ సహా ఏమైనా ఇతర అడ్డంకులుంటే అధికారులు వాటిపై స్పెషల్ ఫోకస్ చేసి వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ దసరా పండుగలోపు మెట్రో రైలు విస్తరణ రూట్‌పై పూర్తిస్థాయి డీపీఆర్‌ను సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాలని అధికారులతో సీఎం రేవంత్ అన్నారు.

# తల్లిపాల ప్రాధాన్యతపై 28,29 తేదీల్లో నాలుగవ అంతర్జాతీయ సదస్సు

హైదరాబాద్: తల్లిపాలు యొక్క ప్రాధాన్యతపై ఈనెల 28 29 తేదీల్లో నాలుగవ అంతర్జాతీయ దక్షణాసియ లంబ్కన్ 2024సదస్సును హైదరాబాద్ నగరంలో నిర్వహిస్తున్నట్లు సదస్సు నిర్వాహకులు డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ దుర్గ భవాని తెలిపారు బుధవారం సోమాజిగూడ ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ హైదరాబాద్లోని ఎనిమిది ప్రముఖ వైద్యశాలల్లో ఈ వర్క్ షాప్ లను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.ఈ సదస్సుకు దేశ విదేశాలనుండి ప్రముఖ వైద్య నిపుణులు బెస్ట్ ఫీడింగ్ లో వచ్చే సాధకబాధకలు ఈ వర్క్ షాప్ లో వివరిస్తారన్నారు. తల్లి అలాగే తల్లి ప్రాముఖ్యతను ఇందులో వివరించడం జరుగుతుందని వారు తెలిపారు తల్లి గురించి తెలుసుకొనే వారందరూ ఈ వర్క్ షాప్ కు హాజరు కావచ్చు అని వారు పేర్కొన్నారు. దాత్రి తల్లిపాల నిధి ఆధ్వర్యంలో ఈ వర్క్ షాప్ ను నిర్వహిస్తున్నారు. "డబ్బా పాలు వద్దు.. తల్లిపాలు ముద్దు" అన్న నినాదంతో ఈ వర్క్ షాప్ ను నిర్వహిస్తున్నారు తెలంగాణ రాష్ట్రంలో ప్రతి వందకు మందికి గాను 40 మంది మాత్రమే పిల్లలు పాలు తాగుతున్నారన్నారని పరిశోదనలు తెలుపుతున్నయన్నారు. అందుకు ప్రధాన కారణం సిజేరియన్స్ రేటు పెరగడమే అని వారు పేర్కొన్నారు బిడ్డలకు పాలు ఇవ్వకుండా ఆఫీసులకు ,పనులకు వెళ్లిపోవడం మూలంగా పిల్లకు సరైన పోషకాలు అందకుండా వారు నష్టపోతున్నారని వారు తెలిపారు. భారతదేశంలో కేవలం 54 శాతం మంది శిషులు మాత్రమే ముందస్తుగా తల్లిపాలను తాగుతున్నారని గణాంకాలు చెబుతున్నాయని వారు తెలిపారు. ఈ గణంకాలు మన దేశ జనాభాలోని బాగా చదువుకున్న వర్గాలకు కూడా తల్లిపాలు మరియు చనుపాలు ఇవ్వడం గురించి పూర్తిగా తెలియకపోవడమే అన్నారు. తల్లి పాలలో పోషకాహారం సమృద్ధిగా ఉంటుందని మరియు బాల్యంలో వచ్చే సంవత్సరాల్లో సంక్రమించే అనేక వ్యాధులకు వ్యతిరేకంగా సాధ్యమైనంత ఉన్నతమైన టీకాగా తల్లిపాలు పనిచేస్తుందని పరిశోధనలో వెల్లడైన్దన్నారు.

సుషేన హెల్త్ ఫౌండేషన్, దాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్, బాగస్వామం మరియు ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, రిషి హుడ్ యునివర్సిటి ,నేషనల్ ఫోరం యూనివర్సిటీ నేషనల్ నియోనాటాలజీ ఫోరం తెలంగాణ స్టేట్ చాప్టర్ పలు సంస్థల మద్దతుతో ఈ సదస్సును పీడియాట్రిక్ అకాడమీ ఆఫ్ తెలంగాణ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

# మహాలక్ష్మి మర్డర్ కేసులో నిందితుడికి సడోమా సూకిస్ట్ క్

బెంగళూరు: కర్ణాటకలోని నెలమంగల సమీపంలో మహాలక్ష్మి (29) అనే యువతి దారుణ హత్యకు గురైన ఉదంతం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. బెంగళూరులోని వ్యాలికవల్ లో ఉన్న ఇంట్లో ఒక రూమ్ లో ఉన్న ఫ్రిజ్ లో ముక్కలు ముక్కలుగా నరికిన మహాలక్ష్మి శరీరాన్ని పోలీసులు రికవర్ చేశారు. అయితే తాజాగా.. మహాలక్ష్మిని అంత కిరాతకంగా నరికి చంపిన వ్యక్తికి సంబంధించిన వివరాలను వైద్యులు వెల్లడించారు. మహిళ శరీర భాగాలను పరీక్షించిన విక్టోరియా ఆస్పత్రి వైద్యులు.. ఆ అమ్మాయిని అంతదారుణంగా హతమార్చిన కిరాతకుడు సడోమా సూకిస్ట్ క్ అనే నేర స్వభావంతో రగిలిపోయినట్లు తెలిపారు.మహాలక్ష్మిని అంత కిరాతకంగా చంపిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి.. జైల్లో పెట్టకపోతే మరికొందరు మహిళలు అతని అరాచకానికి బలయ్యే ప్రమాదం ఉందని తేల్చేశారు వైద్యులు. మహాలక్ష్మి శరీరాన్ని ముక్కలుగా చేసినపుడు.. ప్రతీసారి అతను సైకో ఆనందాన్ని అనుభవించినట్లు వివరించారు. మొత్తం 30 ముక్కలుగా నరికినట్లుగా ప్రాథమికంగా భావించినా.. వైద్య పరీక్షల్లో 59 ముక్కలు చేసినట్లు ఉందని తేల్చారు. కేవలం ఆమె తలనే మూడు ముక్కలుగా నరికేశాడని విచారం వ్యక్తం చేశారు వైద్యులు.మల్లేశ్వరంలోని ఒక బట్టల దుకాణంలో పనిచేసిన మహాలక్ష్మికి ఒక వ్యక్తితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారిందని, ఆర్నెలలకే వారిద్దరూ విడిపోయారని, దానిని తట్టుకోలేక ఆ వ్యక్తే ఇదంతా చేశాడన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అతని ఆచూకీ కోసం పోలీసులు వెస్ట్ బెంగాల్, పరిసర రాష్ట్రాల్లో గాలింపు చర్యలు చేపట్టారు.మహాలక్ష్మికి గతంలోనే పెళ్లై.. ఆరేళ్ల కుమార్తె కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాల కారణంగా 9 నెలల క్రితం ఇద్దరూ విడిపోయి ఉంటున్నట్లు తెలిపారు. మాజీ భర్త హేమంత్ దాస్ ఈ హత్యోదంతంపై మీడియాతో మాట్లాడుతూ.. మహాలక్ష్మితో అక్రమ సంబంధం పెట్టుకున్న అష్రాఫ్ అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేశారు. కొన్ని నెలల క్రితం బెంగళూరులోని స్థానిక పోలీస్ స్టేషన్లో కూడా అతనిపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత అతను బెంగళూరుకు రాకూడదని చెప్పారని, తర్వాత ఏం జరిగిందో తనకు తెలియదన్నాడు దాస్.యూపీ నుంచి వచ్చిన అష్రాఫ్ ఒక బార్బర్ షాపులో పనిచేసేవాడని, తన భార్యతో అక్రమ సంబంధం గురించి గతేడాది ఏప్రిల్ ? మే నెలలో తెలిసిందన్నారు. ప్రస్తుతం తానొక మొబైల్ షాపులో పనిచేస్తున్నానని, 25-30 రోజుల క్రితం ఆమెను ఒక దుకాణం వద్ద కలిసినట్లు చెప్పాడు.ఈ హత్యకేసు పై కర్ణాటక హోంమంత్రి జి పరమేశ్వర మాట్లాడుతూ.. ప్రధాన నిందితుడిని గుర్తించామని, త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకూ కొంత సమాచారం తెలిసిందని, కానీ దానిని ఇప్పుడే వెల్లడించలేమన్నారు. కేసు విచారణ పూర్తయ్యాకే అన్ని వివరాలను వెల్లడిస్తామని చెప్పారు.

# ప్రజా సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట

## కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగ రావు

కోరుట్ల:ప్రజా సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందని కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగ రావు అన్నారు.. బుధవారం కోరుట్ల మండలం జోగన్ పల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలో భాగంగా మహాలక్ష్మి (సిలిండర్ల సబ్సిడీ) కార్డులను

కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగ రావు చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మహాలక్ష్మి పథకం యొక్క ముఖ్య ఉద్దేశం మహిళా సాధికారిక దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారిపై ఆర్థిక భారం తగ్గించడం కోసం వారికి కాలుష్య రహిత వంట వండుకోవడానికి ఈ పథకంలో ఎంపికైన కుటుంబాలకు వినియోగం ఆధారంగా ఎల్పిజి సిలిండర్ లో పరిమితం చేయబడతాయని లబ్ధిదారులు సిలిండర్ అందిన తర్వాత సబ్సిడీ నగదు విూ బ్యాంకు ఖాతాలో నాలుగు రోజుల్లో జమ అవుతుందన్నారు. ఒకవేళ జమకాని లబ్ధిదారులు ఉన్నట్లయితే ప్రొసీడింగ్ పత్రాలలో ఉన్న ఫోన్ నెంబర్ కి ఫోన్ చేసి మన ఖాతాకు సబ్సిడీ అమౌంట్ను క్లియర్ చేసుకోవచ్చునన్నారు.

రైతులకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసిన ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని తెలిపారు. అదే విధంగా గ్రామ అభివృద్ధి కోసం సైతం రోడ్లు మరియు ఇతర అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయిస్తానని హావిూ ఇచ్చారు.అనంతరం నర్సింగరావు కి జోగన్ పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ పక్షాన శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మండల అధ్యక్షులు కొంతం రాజం, నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి, వ్యవసాయ కమిటీ చైర్మన్ పన్నాల అంజి రెడ్డి ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సత్యనారాయణ,ఎ.ఎం.సి డైరెక్టర్ బలవంత రెడ్డి, బిసి సెల్ మండల అధ్యక్షులు ముక్కెర లింబద్రి, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సైదు గంగాధర్,గ్రామ శాఖ అధ్యక్షులు సహదేవ్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజ్ కుమార్ ,మాజీ సర్పంచ్ బద్దం నారాయణ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు బద్దం గౌతం రెడ్డి, పోతవేని శేఖర్,ఇంద్రాల హరీష్,బూర్గుల శ్రీహరి,ఇంద్రాల అశోక్,నక్క నర్సయ్య, మురళీధర్ రెడ్డి,ఎల్పుల అంబేద్కర్,ముత్యపు రాజశేఖర్, తేలు శ్రీను,సిద్దే లక్ష్మణ్, కట్కూరి శ్రీధర్,కొమ్ము శ్యామ్ కుమార్ ,బోయిని రమేష్, సట్టరాజేష్,కొమ్ము శంకర్,సంతోష్,గోపాల్ రెడ్డి,రాజలింగం,రాహుల్, రేషన్ డీలర్లు ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి కల్పనతో పాటు కులవృత్తులపై ప్రత్యేక దృష్టి

కరీంనగర్: జిల్లాలో ఉపాధి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో యువతకు స్కిల్ డెవలప్ మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. స్వయం ఉపాధి కల్పనతో పాటు కులవృత్తులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో డీ ఆర్డీఏ, పట్టణాల్లో మెప్మా, జిల్లాలో 10 మంది కంటే ఎక్కువ పని చేసే వ్యాపారాలు, ప్రైవేట్ కంపెనీలు సంస్థలను సంప్రదించి వారి అవసరాలకు అనుగుణంగా ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన యువకులకు అప్రెంటిస్షిప్ ఇవ్వాలని కోరాలన్నారు. పాఠశాలల్లో ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు ఆర్ట్ క్రాఫ్ట్ లో ఎంబ్రాయిడరీ, టేలరింగ్ శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు.

జూనియర్ కళాశాలల్లో ఉన్న ఒకేషనల్ కోర్సులు, అందించే శిక్షణ, శిక్షణ పొందిన వారి వివరాలు, నేషనల్ అప్రెంటిషిప్ పథకం కింద శిక్షణ పొందిన వారి వివరాలతో నివేదిక అందించాలన్నారు. నిర్మాణరంగంలో కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, వ్యవసాయ రంగంలో మిల్క్ టెస్టర్, బాయిలర్ ఫామ్ సూపర్ వైజర్, జ్యువెలరీ రంగంలో బ్యూటీషియన్, ఫుడ్ ప్రొడక్ట్స్ విభాగం, ఫర్నిచర్ ఫిట్టింగ్ విభాగం, ఎలక్ట్రానిక్స్ విభాగం, టూరిజం హాస్పిటాలిటీ విభాగంలో ఉన్న కోర్సులపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అందులో ఉన్న కోర్సులను వివరించేలా పోస్టర్ రూపొందించాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలను రూపొందించాలని శిక్షణ కలెక్టర్ అజయ్ కుమార్ కు సూచించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన వంటి కేంద్ర పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు.

అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ జిల్లాలో చాలామంది యువత విద్యార్హతలు కలిగి ఉన్నప్పటికీ నైపుణ్యాలు లేక ఉద్యోగాలు పొందడం లేదన్నారు. ఈ సమస్య పరిష్కారానికి నైపుణ్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదట ఎంపిక చేసిన పది పాఠశాలల్లో విద్యార్థులకు వారంలో మూడు గంటలు ఆర్ట్ క్రాఫ్ట్ లో శిక్షణ ఇవ్వాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ చాహత్ భా జ్ పాయ్ పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి, స్కిల్ డెవలప్ మెంట్ కమిటీ కన్వీనర్ తిరుపతిరావు, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ నవీన్, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు, డీ ఆర్డీఓ స్వరూప, కార్మిక శాఖ అధికారి, లీడ్ బ్యాంకు మేనేజర్, జిల్లా వ్యవసాయ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# అంతరిక్ష పరిశోధనల్లో పోటీ వద్దు

**- ప్రపంచ దేశాలు అంతరిక్ష పరిశోధనల్లో కలిసికట్టుగా ఉండాలి**

**- అన్ని దేశాలు కలిసి రోదసి పరిశోధనలు చేస్తే, భూమి మీద సమస్యలు ఉండవు**

**- సంపద అందరికీ సమానంగా అందకపోవడం వల్లే భూమి మీద సమస్యలు**

**- భారతీయ తొలి వ్యోమోగామి రాకేశ్ శర్మ**



బెంగుళూరు : ప్రపంచ దేశాలు అంతరిక్ష పరిశోధనల్లో కలిసికట్టుగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. అన్ని దేశాలు కలిసి రోదసి పరిశోధనలు చేస్తే, భూమి మీద సమస్యలు ఉండవన్నారు. సంపద అందరికీ సమానంగా అందకపోవడం వల్లే భూమి మీద సమస్యలు వస్తున్నాయని, ఒకవేళ స్పేస్ ప్రోగ్రాముల్లో దేశాలు పోటీపడితే, ఇలాంటి సమస్యలు అంతరిక్షంలో కూడా వస్తాయన్నారు. ప్రస్తుతం తమిళనాడులోని కూనూరులో ఆయన నివాసం ఉంటున్నారు. ఇటీవల ఓ మీడియా సంస్థకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. హీలియంతో పాటు అరుదైన కొన్ని ఖనిజాలు భూమి మీద అంతరిస్తున్నాయని, వాటి కోసం అంతరిక్షంలోని ఆస్టరాయిడ్స్‌పై భవిష్యత్తులో మైనింగ్ జరిగే అవకాశాలు ఉన్నట్లు శర్మ అంచనా వేశారు. జాతీయ జెండాలను ధరించి అంతరిక్షానికి వెళ్తే, అప్పుడు సమస్యలు అక్కడ కూడా వస్తాయన్నారు. అందుకే స్పేస్ పరిశోధనల్లో కలిసికట్టుగా ఉండాలన్నారు. ఒకవేళ ప్రపంచ దేశాలన్నీ కలిసి అంతరిక్ష పరిశోధనలు చేపడితే, అక్కడ ఉన్న వనరుల్ని భూమికి తీసుకువస్తే, అప్పుడు భూమిపై సమస్యలు తొలిగిపోతాయన్నారు. లేదంటే భూమి మీద ఉన్న పరిస్థితులే అక్కడ కూడా తయారవుతాయన్నారు. శాటిలైట్ టెక్నాలజీలో ఇండియా మంచి స్థితిలో ఉన్నదని, అంతరిక్షంలో ఎక్కువ కాలం మనుషులు జీవించవచ్చు అన్న సమాచారం రష్యా వద్ద ఉన్నదని, అమెరికా వద్ద అత్యాధునిక టెక్నాలజీ ఉన్నదని రాకేశ్ శర్మ తెలిపారు. భారతీయుడిగానో, రష్యన్‌గానో, చైనీస్, అమెరికా పౌరుడిగానో స్పేస్‌లోకి వెళ్లవద్దు అని, భూమి నుంచి వెళ్లిన మనుషులుగా అంతరిక్షానికి వెళ్లాలని, అలాంటి మార్పు రావాలని, ఎందుకంటే భూమి నుంచి వేల కిలోమీటర్ల దూరం వెళ్లి అక్కడ నేను భారతీయుడిని, రష్యన్‌ను, చైనా, అమెరికా దేశస్థుడని చెప్పుకోలేమన్నారు. రాకేశ్ శర్మకు హీరో ఆఫ్ ద సోవియేట్ యూనియన్ అవార్డు దక్కింది. రష్యాకు చెందిన మిగ్-21, మిగ్-23, మిగ్-27 యుద్ధ విమానాలను నడిపినట్లు చెప్పారు. 1971 బంగ్లాదేశ్ యుద్ధంలో 21 సార్లు మిగ్-21 యుద్ధ విమానాన్ని నడిపినట్లు వెల్లడించారు. మిగ్-21 విమానం నుంచి సురక్షితంగా బయటపడ్డానని, ఎందుకంటే దాంట్లే అన్నీ సేఫ్టీ ఫీచర్స్ ఉన్నట్లు చెప్పారు. అంతరిక్షంలోకి వెళ్లిన తొలి భారతీయుడిగా రాకేశ్ శర్మ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. రష్యాకు చెందిన సోయేజ్ టీ11 వ్యోమనౌక ద్వారా ఆయన సాల్‌యుట్-7 స్పేస్ స్టేషన్‌కు వెళ్లారు. 1982 ఏప్రిల్‌లో ఆయన ఆ ట్రిప్ చేశారు. 8 రోజులు అంతరిక్షంలో ఉన్న రాకేశ్ శర్మ.. ఆ స్పేస్ నుంచి భారత్‌ను ఫోటో తీశాడు. భారరహిత స్థితిలో శరీరంపై ఎటువంటి ప్రభావం పడుతుందన్న కోణంలో యోగా ఎక్స్‌సైజుల ద్వారా స్టడీ కూడా చేశాడు. భారత వైమానిక దళానికి చెందిన రాకేశ్ శర్మతో పాటు మరో పైలెట్ రావిష్ మల్హోత్రా కూడా రష్యాలో శిక్షణకు ఎంపికయ్యారు. కానీ రాకేశ్ శర్మ మాత్రమే నింగిలోకి వెళ్లారు. అనేక అంశాలపై ఆయన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. శిక్షణ కోసం రష్యా వెళ్లిన సమయంలో.. ఆ దేశ భాష అర్థం కాలేదన్నారు. కానీ శిక్షణ కొనసాగుతున్నా కొద్దీ.. రష్యన్ భాషపై పట్టు వచ్చిందన్నారు. ఇక రష్యాలో ఉన్న అతిశీతల వాతావరణాన్ని తట్టుకోవడం కూడా కష్టమైందేనన్నారు. వింటర్ సీజన్‌లో మైనస్ 30 ఉష్ణోగ్రతలో గడపాల్సి వచ్చినట్లు చెప్పారు. సాల్‌యుట్-7 స్పేస్ స్టేషన్ 1971లో తొలిసారి లాంచ్ చేశారు. 1991 వరకు ఆ స్పేస్ స్టేషన్ ఉన్నది. 1982లో రాకేశ్ శర్మ ఆ స్టేషన్‌లో భూమి చుట్టూ రౌండేశారు. అంతరిక్షంలోకి వెళ్లి.. కిందకు చూస్తూ.. భూమి మీద హద్దులు ఏమీ కనిపించవని రాకేశ్ శర్మ తన ఇంటర్వ్యూలో ఓ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# విజిబుల్ పోలీసింగ్ పై దృష్టి సారించాలి

**కమిషనర్ అనురాధ**



సిద్దిపేట: రాజగోపాలపేట.. చిన్నకోడూర్ పోలీస్ పోలీస్ స్టేషన్లను పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ మంగళవారం సందర్శించారు. పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలను మరియు సీజ్ చేసిన వాహనాలను రిసెప్షన్ ఏరియాను, పోలీస్ స్టేషన్ పరిధిలోని పార్ట్ 2 మ్యాప్ ను పోలీస్ స్టేషన్లో ఉండే మాల్ రూమును పరిశీలించారు. మరియు పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా వారి సమస్యలు పరిష్కరించాలి. డయల్ 100 కాల్ కు వెంటనే రెస్పాండ్ కావాలి. ఏ సంఘటన జరిగినా తప్పకుండా ఎస్ఐ సందర్శించాలి. విజబుల్ పోలీసింగ్ పై దృష్టి సారించాలి. విపిఓ వ్యవస్థను మరింత బలపరచాలి. ప్రతిరోజు ఉదయం సాయంత్రం విజబుల్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని సూచించారు . రోడ్డు ప్రమాదాల నివారణ గురించి రోడ్ సేఫ్టీ కమిటీ మెంబర్లతో తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పోలీస్ అధికారులు సిబ్బంది తరచుగా గ్రామాలను సందర్శించాలి. ఇన్ఫర్మేషన్ వ్యవస్థను మెరుగుపరుచుకోవాలి. లోక్ అదాలత్ లో సాధ్యమైనంత ఎక్కువ పరిష్కరించాలి.

ప్రజలతో మమేకమై విధులు నిర్వహించాలి ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై నిఘా పటిష్టం చేసి సమూలంగా నిర్మూలించాలి. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అధికారులు సిబ్బంది నిజాయితీగా విధులు నిర్వహించాలి విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించరాదు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

ప్రతి దరఖాస్తుదారునితో తప్పకుండా సంబంధిత ఎస్ఐ మాట్లాడాలి. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలు మరియు పోలీస్ స్టేషన్ రికార్డ్స్ సిడి ఫైల్స్ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా సిబ్బందితో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. ప్రతి కేసులో పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి దరఖాస్తుకు రిసిప్ట్ ఇవ్వాలని రిసెప్షన్ సూచించారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలని, అదే సమయంలో ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని సూచించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై విధులు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాల గురించి మరియు ప్రజలు ఎవ్వరూ సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి రోజు ఉదయం సాయంత్రం విజబుల్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. విపిఓ విలేజ్ పోలీస్ ఆఫీసర్ బుక్స్ తనిఖీ చేశారు, గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మత్తుపదార్థాల వల్ల కలిగే పర్యవసానాల గురించి గురించి స్కూల్ లలో కాలేజీలలో గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలు అమ్మే వారిపై సేవించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలను ఉక్కు పాదంతో అణిచివేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపి మధు, సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను, ఎస్బిఐ ఇన్స్పెక్టర్ కిరణ్, శ్రీధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ నమోదు కార్యక్రమం కట్టుదిట్టంగా నిర్వహించాలి

**పెండింగ్ ఓటర్ నమోదు సంబంధించి ఫారం 6,7,8 దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలి**

**ఇంటింటి సర్వే లో ఆధార్ నెంబర్ సేకరణ తప్పనిసరి కాదు**

**సెప్టెంబర్ 28 నాటికి ఇంటింటి సర్వే వంద శాంతం పూర్తి చేయాలి**

**రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి నాగిరెడ్డి**

జగిత్యాల: రాష్ట్రంలో ఓటర్ నమోదు కార్యక్రమం కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి నాగిరెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి నాగిరెడ్డి మంగళవారం నెట్ 2.0 పై జిల్లాల కలెక్టర్ లతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ గత వారం రోజులుగా నూతన ఓటర్ నమోదు పై చేపట్టిన ఇంటింటి సర్వే పని తీరు చాలా మెరుగుపడిందని, ఇప్పటి వరకు 90 శాతం పైగా ఇంటింటి సర్వే పూర్తయిందని, సెప్టెంబర్ 28 నాటికి 100% ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ స్థాయి అధికారుల ద్వారా ఇంటింటి సర్వే పూర్తి చేయాలని అన్నారు. పెండింగ్ ఉన్న ఓటర్ నమోదు సంబంధించి ఫారం 6, ఫారం 7, ఫారం 8 దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని సీఈఓ ఆదేశించారు. సెప్టెంబర్ నెలాఖరు వరకు పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలని అన్నారు. ఇతర ప్రాంతాలకు తరలి వెళ్ళిన వారి వివరాలు నోటీసు జారీ చేసి నిర్దేశిత ప్రోసిడ్యూర్ ఫాలో అయిన తరువాత తొలగించాలని అన్నారు. ఇంటింటి సర్వే లో ఆధార్ నెంబర్ సేకరణ తప్పనిసరి కాదని , ఓటర్లు ఇష్టం ఉంటే ఇవ్వవచ్చని, బలవంతం చేయరాదని అన్నారు. ఇంటింటి సర్వే సంబంధించి వచ్చిన నూతన ఓటర్ నమోదు దరఖాస్తుల వివరాలు, నూతన ఓటర్ల నమోదు సంబంధించిన అంశాలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలని అన్నారు. నూతన ఓటరు కార్డుల ముద్రణకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని, బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సమర్పించాలని, పోలింగ్ కేంద్రం లోకేషన్, ఫోటోలను బి.ఎల్.ఓ యాప్ లను అప్ లోడ్ చేయాలని అన్నారు. బి.ఎల్.ఓ యాప్ వినియోగంపై బూత్ స్థాయి అధికారులకు అవసరమైన శిక్షణ అందించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియ డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ అక్టోబర్ 29 ముందు పూర్తి చేయాలని సీఈఓ అధికారులను ఆదేశించారు.

మెదక్ -నిజామాబాద్ -అదిలాబాద్ -కరీంనగర్ జిల్లాల గ్రాడ్యుయేట్స్, టీచర్లు, ఖమ్మం నల్గొండ జిల్లాల టీచర్ల శాసనమండలి సభ్యుల నియోజకవర్గ స్థానాలకు ఎన్నిక కోసం సెప్టెంబర్ 30న ,పబ్లిక్ నోటీస్ జారీ చేసి ఓటర్ నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు కూడామరోసారి తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, ఈ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్లు పి. రాంబాబు, గౌతమ్ రెడ్డి, తహసిల్దార్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా లో అసలు దోషులు సేఫ్,,,,

**తప్పు ఎవరిది..? శిక్ష ఎవరికి**

హైదరాబాద్: హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతలతో ఎవరు ఎక్కువగా నష్టపోతున్నారు ?. ఈ ప్రశ్నకు సమాధానం.. మధ్యతరగతి ప్రజలే. ప్రభుత్వ స్థలాలు, చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో కడుతున్న కట్టడాలు అన్నీ రాజకీయ నేతలు, వారి బినామీలవే. వారు మాత్రమే అందర్నీ మేనేజ్ చేసి..అన్ని అనుమతులు తీసుకు రాగలరు. సామాన్యులకు సాధ్యం కాదు. కానీ అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పి.. వీరిని ఆ రాజకీయ నేతలు, బినామీలు నమ్మించి మొత్తం అంటగట్టేస్తారు. ఎంతగా అంటే లోన్లు ఇప్పిస్తారు. రిజిస్ట్రేషన్లు కూడా చేయిస్తారు. కానీ ఎక్కడో సర్వే నెంబర్ గోల్ మాల్ చేసి.. మొత్తానికి ముంచేస్తారు. ఇప్పుడు అదే జరుగుతోంది. ప్రభుత్వంలో ఉన్న వారు..రాజకీయ నేతలు ముఠాగా ఏర్పడి పేద, మధ్యతరగతి ప్రజల సొంత ఇంటి కలను ఆసరాగా చేసుకుని దోచుకున్నారు. ఇప్పుడు అన్నీ కూల్చేశారు. తప్పు ఎవరిది..? శిక్ష ఎవరికి పడుతుంది ?కొంత విరామం తర్వాత ఆదివారం కిష్టారెడ్డిపేట. పటేల్ కూడ, కూకట్ పల్లి నల్ల చెరువు ప్రాంతాల్లో కూల్చివేతలు చేసింది. ఆ సమయంలో బాధితుల వేదన వర్ణనాతీతం. ఎందుకంటే.. వాటన్నింటినీ కబ్జా చేసి అమ్ముకున్నవారు అడ్రస్ లేకుండా పోయారు. రూపాయి రూపాయి పోగేసుకుని కొనుక్కున్న వారో.. లీజుకు తీసుకున్నవారో నష్టపోయారు. పటేల్ గూడలో కూల్చిన ఇళ్లకు మూడు రోజుల కిందట రిజిస్ట్రేషన్ చేశారు. ఇవాళ కూల్చేశారు. రిజిస్ట్రేషన్ చేసి మరీ కూల్చడం అంటే.. ప్రభుత్వాన్ని నమ్మిన వారిని వంచించడమే. ఇలాంటి తప్పులు ఎక్కడ జరుగుతాయో.. దానికి కారణం ఎవరో ప్రభుత్వానికి తెలుసు. కానీ బాధితు?లుగా చివరి కొనుగోలుదారులే మిగులుతున్నారు. ఆ కూల్చివేతలతో తమ సమస్తం కోల్పోతున్నామని వారు ఎంత ఆవేదన చెందినా ప్రయోజనం ఉండటం లేదు. కిష్టారెడ్డిపేటలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారు. దానికి పట్టాలిచ్చారు. లోన్లు వచ్చేలా చేశారు. కానీ.. అది ప్రభుత్వ భూమి అని అందరకీ తెలుసు. మరి అనుమతులు ఎలా ఇచ్చారు. రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి?. అంతా చేసేసి కొనుగోలు దారులకు నష్టం జరిగేలా కూల్చివేయడం అంటే ద్రోహం చేస్తున్నట్లే లెక్క. ఇరప్పుడు ప్రభుత్వం ఆ భూముల్ని కబ్జా చేసి అమ్ముకున్న వారి దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసి... చివరి కొనుగోలుదారులకు ఇవ్వాలి. వారికి నష్టం జరగకూండా చూడాలన్న భావన ఏర్పడుతోంది. ఎందుకంటే ఈ పాపంలో ప్రభుత్వానికీ భాగం ఉంది. ప్రభుత్వ అధికారులు ప్రభుత్వంలో భాగమే . వారు తప్పు చేస్తే ప్రభుత్వం తప్పు చేసినట్లే. ఆ తప్పులకు ప్రజల్ని బాధ్యు?ల్ని చేయలేరు. అందుకే.. ఇలా ఇళ్లు నష్టపోతున్న ప్రతి ఒక్కరికీ వారి సొమ్ము వారికి వెనక్కి ఇచ్చే ఏర్పాట్లు చేయాలి. అలా చేస్తేనే మరోసారి కబ్జా చేసి అమ్ముకునేవాళ్లు కూడా ఆలోచిస్తారు. మరోసారి ఎప్పడైనా కట్టాల్సి వస్తుందని కంగారు పడతారు. ఓ ప్రభుత్వ భూమిలో అపార్టుమెంట్లు కట్టే వరకూ వ్యవస్థలు ఏమి చేస్తాయి.. ఆ అపార్టుమెంట్లకు హోమ్ లోన్లు వచ్చేలా డాక్యుమెంట్లు రెడీ అయ్యేదాకా ఏమి చేస్తారు ?. ఇలా చేయడం అంటే.. ఖచ్చితంగా ప్రభుత్వ లోపం ఉన్నట్లే. దానికి ప్రజల్ని శిక్షించలేరన్నది ఎక్కువ మంది చెప్పేమాట . హైడ్రాకు సూపర్ వపర్లు ఇచ్చిన ప్రభుత్వం.. కూల్చివేతలకు.. కేసులకే కాదు.. నష్టపోతున్న మధ్యతరగతి ప్రజలకు.. అధికారుల మోసాలకు బలైపోయిన పేదలకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. లేకపోతే ప్రజావిశ్వాసాన్ని ప్రభుత్వం కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

# 1979 నాటి మ్యాప్స్ తో హైడ్రా...

హైదరాబాద్: విశ్వనగరం హైదరాబాద్‌ను ఫ్యూచర్ సిటీగా మార్చాలన్న సంకల్పంతో ఉన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇందుకు ముందుగా నగరానికి ముంపు ముప్పు తప్పించాలని భావిస్తున్నారు. చిన్న వర్షం పడినా రోడ్లు చెరువులను తలపించే పరిస్థితి మారాలన్న లక్ష్యంతో హైడ్రా ఏర్పాట చేశారు. హైదరాబాద్‌లో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడడంతోపాటు, చెరువులు, కుంటలను రక్షించడం, ప్రజలను విపత్తు నుంచి కాపాడడం దీని లక్ష్యం. ప్రస్తుతం ప్రధానంగా చెరువులు, కుంటలను పునరుద్ధరించే పని చేపట్టింది హైడ్రా, కమిషనర్ రంగనాథ్ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. ఎవరి ఒత్తిడికీ తలొగ్గకుండా తన పని తాను చేసుకుపోతున్నారు. వ్యూహాత్మకంగా ఆక్రమ నిర్మాణాలపైకి బుల్డోజర్లను పంపుతున్నారు. ఇప్పటి వరకు వంద ఎకరాలకుపైగా చెరువులు, కుంటల భూమిని రికవరీ చేశారు. ఇక కోర్టు కూడా హూడ్రా విషయంలో పెద్దగా జోక్యం చేసుకోవడం లేదు. చాలా మంది కోర్టును ఆశ్రయిస్తుండడంతో హైడ్రాకు సీఎం మరిన్ని అధికారాలు అప్పగించడంతోపాటు చట్ట బద్ధత కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. ఇక ఆక్రమిత స్థలాల్లో అనుమతులు ఇచ్చిన అధికారులపైనా హైడ్రా కమిషనర్ చర్యలకుదిగుతున్నారు. ఇప్పటికే ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో చాలా మంది అధికారులు ఆందోళన చెందుతున్నారు. కొందరు అధికారులు చెరువులు, కుంటల హద్దులను తప్పుగా చూపించే ప్రయత్నం మొదలు పెట్టారు. హద్దులను కొత్తగా చూపించే మ్యాప్‌లు సిద్ధం చేస్తున్నారు. దీంతో ఆక్రమణదారులకు రక్షనతోపాటు, తమకు ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు. కానీ, రంగనాత్.. అంతకు మించి ఆలోచన చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సాయంతో 45 ఏళ్లనాటి ఉపగ్రహ చాయాచిత్రాలు సేకరించే పనిలో పడ్డారు. ఈమేరకు హైడ్రా, ఎన్‌ఆర్‌ఎస్సీ మధ్య త్వరలోనే ఒప్పందం జరుగనుంది. ఇప్పుడు చర్యలు తీసుకోకపోతే.. నగరంలో ఉన్న అరకొర చెరువులు కూడా మిగలవ్న భావనలో ప్రభుత్వం కూడా ఉంది. ఉన్న చెరువులను కాపాడేలా హైడ్రా చర్యలు చేపడుతోంది. గతలో చెరువులు, కుంటలు ఎలా ఉండేవో తెలిసేలా మ్యాప్‌లు కావాలని రంగనాథ్ ఇటీవల ఎన్‌ఆర్‌ఎస్సీ అధికారులను కోరారు. ఇటీవల బాలానగర్‌లోని కేంద్రాన్ని సందర్శించారు. శాస్త్రవేత్తలతో మాట్లాడారు. చెరువుల సంరక్షణకు ఎన్‌ఆర్‌ఎస్సీ సాయం కోరారు. చెరువుల హద్దులను చూపించే స్పష్టమైన పటాలు ఇవ్వాలని కోరారు. దీంతో హద్దులు చెరిపేసినా గుర్తించే వీలుంటుందని తెలిపారు. అధికారికంగా మ్యాప్‌లు కొంటామని తెలిపారు. ఇదిలా ఉంటే ఎన్‌ఆర్‌ఎస్సీ సంస్థ ఇప్పటికే హైడ్రాకు 56 చెరువుల పటాలు అప్పగించింది. 1979 నుంచి 2023 మధ్య చెరువులు ఎలా ఆక్రమణకు గురయ్యాయో చూపేలా చిత్రాలు ఉన్నాయని తెలుస్తోంది. అనేక చెరువులు కొన్ని రోజుల్లోనే కనుమరుగైనట్లు గుర్తించారు. ఆయా పటాలు మరింత పక్కాగా సేకరించి హద్దులు నిర్ణయించాలని రంగనాథ్ భావిస్తున్నారు

# రోజురోజుకు దేశం లో పెరిగిపోతున్న

## కండోమ్ లేని శృంగారం చేసే ట్రెండ్

**- ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక విడుదల**

**- దేశంలో కండోమ్‌ల గురించి తెలియని వారు ఆరు శాతం మంది**

**- ఏటా సగటున 33.07 కోట్ల కండోమ్‌లు సేల్**

**- అత్యధికంగా కండోమ్‌ల వినియోగిస్తున్న ప్రాంతంహవేలీ**

**- అత్యల్పంగా కండోమ్‌ల వినియోగిస్తున్న రాష్ట్రము కర్ణాటక**

దేశంలో కండోమ్ వినియోగించకుండా శృంగారం చేసే ట్రెండ్ రోజురోజుకు పెరిగిపోతున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక విడుదల చేసిన ప్రతిసారి.. దేశంలో కండోమ్ లేకుండా శృంగారం చేసేవాళ్ల సంఖ్య పెరుగుతోందని చెబుతోంది. ఈసారి కూడా అదే మాట చెప్పింది. అంతేగాక ఏయే రాష్ట్రాల్లో కండోమ్‌ల వినియోగం ఎక్కువగా ఉందో కూడా వెల్లడించింది. కండోమ్‌ల వాడకంపై ఆరోగ్య శాఖ నిరంతరం అవగాహన కల్పిస్తున్నది. అయినా దాని మాత్రం తగ్గుతోంది. ప్రస్తుతం ఏయే రాష్ట్రాలు కండోమ్‌లను ఎక్కువగా వినియోగిస్తున్నాయనే విషయం తాజా అధ్యయనంలో వెల్లడైంది. నేషనల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫ్యామిలీ హెల్త్ నిర్వహించిన ఈ సర్వేలో.. కేంద్రపాలిత ప్రాంతం దాద్రా నగర్ హవేలీలో కండోమ్‌ల వినియోగం అత్యధికంగా ఉంది. కేవలం రాష్ట్రాలపరంగా చూస్తే ఆంధ్రప్రదేశ్ కండోమ్‌ల వినియోగంలో తొలి స్థానంలో ఉన్నది. ఓవరాల్‌గా చూస్తే మాత్రం దాద్రా నగర్ హవేలి తొలి స్థానంలో, ఏపీ రెండో స్థానంలో ఉన్నాయి. దాద్రా నగర్ హవేలీలో ప్రతి 10 వేల జంటలలో 993 జంటలు శృంగార సమయంలో కండోమ్‌లను వినియోగిస్తున్నాయి. ఏపీలో ప్రతి 10 వేల జంటల్లో 978 జంటలు కండోమ్‌లు వాడుతున్నాయి. ఇదిలావుంటే కర్ణాటకలో మాత్రం ప్రతి 10 వేల జంటల్లో కేవలం 307 జంటలు మాత్రమే కండోమ్‌లను వినియోగిస్తున్నాయి. పుదుచ్చేరిలో ప్రతి 10 వేల జంటల్లో 960 జంటలు, పంజాబ్‌లో ప్రతి 10 వేల జంటల్లో 895 జంటలు, చండీగఢ్‌లో ప్రతి 10 వేల జంటల్లో 822 జంటలు, హర్యానాలో ప్రతి 10 వేల జంటల్లో 685 జంటలు శృంగారం కోసం కండోమ్‌లు వాడుతున్నారు. ఇక హిమాచల్ ప్రదేశ్‌లో ప్రతి 10 వేల జంటల్లో 567 జంటలు, రాజస్థాన్‌లో ప్రతి 10 వేల జంటల్లో 514 జంటలు, గుజరాత్‌లో ప్రతి 10 వేల జంటల్లో 430 జంటలు కండోమ్‌లు వినియోగిస్తున్నాయి. అదేవిధంగా దేశంలో కండోమ్‌ల గురించి తెలియని వారు ఆరు శాతం మంది ఉన్నారని తాజా నివేదిక పేర్కొంది. అంటే దేశంలో 94 శాతం మందికి మాత్రమే కండోమ్ గురించి తెలుసు. దేశంలో ఏటా సగటున 33.07 కోట్ల కండోమ్‌లు సేల్ అవుతున్నాయని అధ్యయనం తెలిపింది.

# పెండింగ్ ఫీజులు చెల్లించండి

హైదరాబాద్: పెండింగ్ లో ఉన్న 12వందల కోట్ల ఫీస్ రిఎంబెర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రొఫెషనల్ డిగ్రీ కోలేజస్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ప్రభుత్వన్నీ డిమాండ్ చేసింది. హైదరాబాద్, బోర్డ్స్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని డిగ్రీ కళాశాలల యాజమాన్యం పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం నుండి రావాల్సిన ఫీస్ రీఎంబెర్స్మెంట్ బకాయిలు రాక తమ టీచర్స్,సిబ్బంది యొక్క జీతాలు చెల్లించక తమ బ్రతుకులు చిన్నా విన్నంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇంటి ఈఎంఐ రుణాలు, అద్దెలు,క్రెడిట్ కార్డుల బకాయిలు,కుటుంబ పోషణ లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని దీనితో టీచర్స్ విద్యార్థులపై సరైన విద్యను కూడా బోధించలేకపోతున్నారని వారు పేర్కొన్నారు.

# గోడ దూకిన ఎమ్మెల్యేలు..అటో.. ఇటో పరిస్థితి

హైదరాబాద్: ఎన్నికల సమయం వచ్చిందంటే చాలు.. నేతల గోడ దూకుళ్ళు సర్వసాధారణం.. ఈ తంతు ఎన్నికలు పూర్తై, ఫలితాలు వచ్చిన తర్వాత కూడా అడపా దడపా జరుగుతూనే ఉంటాయి. ప్రస్తుత రోజుల్లో అయితే.. ఈ వ్యవహారాన్ని జనాలు సైతం చాలా లైట్‌గా తీసుకుంటున్నారు. కానీ గోడదూకిన ఎమ్మెల్యేలు? అటో, ఇటో తెలియని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడటం ఏదైతే ఉందో? అదేఇప్పుడు తెలంగాణ రాజకీయాల్ని నిప్పుల కుంపటిలా ఉడికిస్తోంది. కండువా మార్చి, ప్రభుత్వంలో కీలక పదవి దక్కించుకున్న ఆ జంపింగ్ ఎమ్మెల్యేకి.. తాను ఏ పక్షాన ఉన్నానో కూడా చెప్పుకునే పొజిషన్ లేకుండా పోయిందట.తెలంగాణలో మరోసారి ఫిరాయింపుల రాజకీయం రచ్చరేపుతోంది. ఇటీవల జరిగిన సీఎల్పీ భేటీలో? శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రత్యక్షమవడంతో.. ఈ వ్యవహారం మరోసారి టాప్‌న్యూస్‌లో నిలిచింది. కొద్ది రోజుల క్రితం ఫిరాయింపుల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపుడి గాంధీ ల మధ్య రచ్చ రాజకీయ వర్గాలలో తీవ్ర దుమారం లేపింది. బీఆర్ఎస్ లో గెలిచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, ఆరికెపుడు గాంధీ, ప్రకాష్ గౌడ్ లతోపాటు మొత్తం పది మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద లు హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌ను కలసి వినతి పత్రం ఇచ్చినా ఆయన పట్టించుకోట్లేదని హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నేతల ఫిర్యాదును విచారించిన కోర్టు నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ కార్యాలయానికి సూచించింది. ఈ వ్యవహారంలో ఆరికెపుడు గాంధీ స్పందిస్తూ నేను కాంగ్రెస్ కండువా కప్పుకోలేదు, బీఆర్ఎస్‌లోనే ఉన్నానని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే పాడి కౌశిక్ రెడ్డి అరికెపుడి గాంధీ ఇంటికి వెళ్లి బీఆర్ఎస్ కండువా కప్పుతానని చెప్పడంతో, దమ్ముంటే మా ఇంటికి రావాలి.. లేదంటే నేను కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్తానని సవాల్ విసిరారు. అంతేకా? ఏకంగా కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లి మరీ అనుచరులతో ఇంటి మీద హంగామా చేశాడు.బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు వ్యాఖ్యలపై ఆరికెపుడిగాంధీ స్పందించనప్పటికి మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ సీఎల్పీ సమావేశం జరిగిన మాదాపూర్ ప్రాంతం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో ఉంది. కాబట్టి సీఎం రేవంత్ రెడ్డిని మార్యద పూర్వకంగా కలిశాడు. దానికి ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నారని శ్రీధర్ బాబు మండిపడ్డారు. ఇదంతా ఒకెత్తైతే మాదాపూర్ లో జరిగిన సీఎల్పీ మీటింగ్ కి ఆరికెపుడు గాంధీ హాజరయ్యారు. ఇక్కడే అసలు ట్విస్ట్ నెలకొంది. గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరనప్పుడు సీఎల్పీ సమావేశానికి ఎలా వెళతారనేది ప్రతిపక్షాల ఆరోపణ. హరీష్ రావు కూడా ఇప్పటికే కౌంటర్ స్టార్ట్ చేశారు.వివాదం నుంచి బయటపడేందుకు, తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని చెప్పుకొన్న అరెకపూడి గాంధీ.. ఇప్పుడు సీఎల్పీ భేటీలో పాల్గొనడం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశమైంది. కాంగ్రెస్‌లో చేరినట్టు గతంలో ఎక్స్‌లో పోస్టు చేసింది ఆయనే.. పబ్లిగ్గా ప్రకటించింది ఆయనే? ఆ తర్వాత పీఏసీ చైర్మన్ పదవి విషయంలో వివాదం చెలరేగడంతో తాను కాంగ్రెస్‌లో చేరలేదన్నదీ ఆయనే? ఇప్పుడు కాంగ్రెస్ శాసనసభాపక్ష భేటీకి హాజరైందీ ఆయనే.. కానీ, ఇప్పటికీ ఆయన అటో, ఇటో అన్నది మాత్రం ఎవ్వరికీ అర్థం కావడం లేదు. తానెటువైపనే విషయాన్ని గాంధీ కూడా గట్టిగా చెప్పలేని పరిస్థితి. పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీతో పాటు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, డాక్టర్ సంజయ్‌కుమార్, ప్రకాష్ గౌడ్‌లు అటెండ్ అయ్యారు. ఈ ఇష్యూపై బీఆర్ఎస్ మరోసారి గళమెత్తుతోంది. కాంగ్రెస్‌లో చేరలేదని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన కామెంట్స్ అబద్ధాలు అంటూ ఎక్స్ వేదికగా మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు.అయితే దీనికి మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. హరీష్ రావుకు కౌంటర్ ఇచ్చారు. సీఎం తన నియోజకవర్గానికి వచ్చినందుకే..అరికెపూడి గాంధీ వచ్చి కలిశారే తప్ప.. సీఎల్పీ సమావేశానికి హాజరు కాలేదన్నారు. మిగతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. కాంగ్రెస్ సమావేశానికి రాలేదని.. కేవలం సీఎంను మర్యాద పూర్వకంగా కలిసి వెళ్లారని చెప్పుకొచ్చారు. సిద్ధిపేట నియోజకవర్గానికి సీఎం వెళ్తే.. కార్యక్రమంలో హరీష్‌రావు పాల్గొనరా అంటూ శ్రీధర్‌బాబు ఎదురు ప్రశ్నించారు.అధికార కాంగ్రెస్ పార్టీలో కూడా ఫిరాయింపుల అంశం కుతకుతలాడుతోంది. గాంధీభవన్ వేదికగా జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశాల్లో వివాదం రాజుకుంటోంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు.. గాంధీభవన్‌లో జరిగిన సమీక్షా సమావేశాలకు హాజరయ్యారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశాలకు ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశానికి కడియం శ్రీహరి, కరీంనగర్ జిల్లా సమావేశానికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, నిజామాబాద్ జిల్లా సమావేశానికి పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. అయితే కరీంనగర్ జిల్లా సమావేశం కాస్త రసాభాసా జరిగింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పేర్ల జాబితాలో పార్టీ సీనియర్ నేత ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేరు పొందుపరచలేదు. అదే సమయంలో పార్టీ ఫిరాయించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేరును ప్రస్తావించారు. దీంతో జీవన్ రెడ్డి పార్టీ పెద్దల తీరుపై గరం అయ్యారు. జరిగిన తప్పును గ్రహించిన పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, ఇంచార్జ్ దీపాదాస్ మున్షి జోక్యం చేసుకొని సర్దిచెప్పారు. ఏదో పొరపాటు వల్ల పేరు పడలేదని..జరిగిన దానికి సారీ చెప్పి.. మరోసారి ఇలాంటి తప్పిదం జరగదని సర్దిచెప్పారు. శనివారం గాంధీభవన్ జరిగిన పరిణామాల నేపథ్యంలో.. ఆదివారం జరిగిన సీఎల్పీ సమావేశానికి జీవన్ రెడ్డి డుమ్మా కొట్టారుఇలా పార్టీ ఫిరాయింపుల అంశం హస్తం పార్టీలో ఎన్నో సమస్యలకు దారి తీస్తుంది. బీఆర్ఎస్ మాత్రం పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత కోసం గట్టి ఆధారాలు సేకరించే పనిలో బిజీగా ఉంది. గాంధీభవన్‌లో జరిగే సమావేశాలకు..సీఎల్పీ భేటీకి ఫిరాయింపు ఎమ్మెల్యేలు హాజరైన ఎవిడెన్స్‌ను సేకరించి కోర్టుల దృష్టికి తీసుకెళ్లాలని చూస్తోంది. మరోవైపు ఈ వ్యవహారం నుంచి తప్పించుకునేందుకు టెక్నికల్ అంశాలపై కాంగ్రెస్ ఫోకస్ చేసింది. డైలీ ఎపిసోడ్‌లా కొనసాగుతున్న ఈ ఇష్యూ ఇప్పట్లో కొలిక్కి వచ్చే అవకాశం అయితే కనిపించడం లేదు. అయితే ఫైనల్‌గా ఎవరు పైచేయి సాధిస్తారనేది మాత్రం హాట్ టాపిక్‌గా మారింది.

# 400 కోట్ల ఆదాయం ... భారీగా తగ్గని రియల్...

హైదరాబాద్: హైడ్రా ఇప్పుడు తెలంగాణతోపాటు దేశంలో ఎక్కడ చూసినా ఈ అంశంపైనే చర్చ జరుగుతోంది. హైదరాబాద్ నగరంలోని చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారి ఆట కట్టించేందుకు తెలంగాణ ప్రభుత్వం రెండు నెలల క్రితం హైడ్రాను ఏర్పాటు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా గ్రేటర్ హైదరాబాద్ లో చెరువుల ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. బడాబాబులు మొదలు సామాన్యుల వరకు చెరువులను ఆక్రమించి కట్టిన కట్టడాలన్నింటిని నేలమట్టం చేస్తోంది హైడ్రా.ఈ క్రమంలో ఇప్పటివరకు సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది హైడ్రా. ఈ పరిస్థితుల్లో హైడ్రాకు మరిన్ని అధికారులు కట్టబెట్టడంతోపాటు న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించింది ప్రభుత్వం. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా పడిపోయింది. ఆస్తులు కొనాలంటే ప్రతిఒక్కరూ భయపడిపోతున్నారు. దాంతో నిర్మాణ రంగం పూర్తిగా మందగమనంలోకి పడిపోయింది. చాలా వరకు సర్వేలు కూడా ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నారు. అక్రమ లే అవుట్లతో ప్రజలు ఆగం కాగా.. ఇప్పుడు కొనేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. కోట్ల రూపాయలు పెట్టి కొనుగోలు చేస్తే ఎప్పుడు ఎలాంటి నోటీసులు అందుకోవాల్సి వస్తుందోనని ఆందోళనలతో ఉన్నారు..ఐతే క్యాబినెట్ భేటీలో హైడ్రాపై చర్చ సందర్భంగా మంత్రుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. హైడ్రాపై ప్రజల్లో ఓవైపు ప్రశంసలు వస్తుండగా.. మరోవైపు వ్యతిరేకత వ్యక్తమవుతోందని కొందరు మంత్రులు సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. మరీ ముఖ్యంగా హైడ్రా పనితీరుపై సామాన్యుల్లో ఆందోళనలను ఒకరిద్దరు మంత్రులు సీఎం రేవంత్ రెడ్డికి చెప్పారట.హైడ్రా ఏర్పాటు తర్వాత.. రిజిస్ట్రేషన్ల ద్వారా సమకూరే ప్రభుత్వ ఆదాయం తగ్గిపోయిందనే విషయాన్ని కూడా ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పై హైడ్రా తీవ్ర ప్రభావం చూపుతోందని, హైడ్రా ఎఫెక్ట్ తో గ్రేటర్ లో నిర్మాణ రంగం పూర్తిగా దెబ్బతింటుందేమోననే అభిప్రాయాన్ని కొందరు మంత్రులు కేబినెట్ సమావేశంలో వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.హైడ్రా దూకుడు ప్రభావం రిజిస్ట్రేషన్లపై స్పష్టంగా కనిపిస్తోందని మంత్రివర్గం సమావేశంలో ఓ సీనియర్ మంత్రి గుర్తు చేశారని తెలుస్తోంది. హైడ్రా ఎఫెక్టుతో ఆగస్టులో సుమారు 400 కోట్ల రూపాయల రిజిస్ట్రేషన్ల ఆదాయం తగ్గిందని సదరు మంత్రి ఆవేదన వ్యక్తం చేశారట. హైడ్రా పనితీరుతో గ్రేటర్ హైదరాబాద్ లో నిర్మాణ సంస్థలు, బిల్డర్లు కొత్త నిర్మాణాలపై అనుమతులు తీసుకోవడానికి జంకుతున్నారన్న విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారట మరో సీనియర్ మంత్రి.ఇలాంటి సమయంలో హైడ్రాకు మరిన్ని అధికారాలు కట్టబెట్టి, చట్టబద్ధత కల్పిస్తే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని ఒకరిద్దరు మంత్రులు క్యాబినెట్ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారని సమాచారం. హైడ్రా మంచి ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసినా, అది ప్రభుత్వ భూములను రక్షిస్తున్నా.. అదే సమయంలో ఎదురవుతున్న ప్రతికూలతలను సైతం పరిగణలోకి తీసుకోవాలని మంత్రులు సూచించారని తెలుస్తోంది. హైడ్రాపై మంత్రివర్గ సహచరుల అభిప్రాయాలు, సూచనలను సావదానంగా విన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అంతే సూటిగా స్పష్టంగా సమాధానం చెప్పారని సమాచారం.రాష్ట్రంలో హైదరాబాద్‌లోనే రియల్ వ్యాపారంతో ఆదాయం ఎక్కువ. రిజిస్ట్రేషన్లు ఎన్ని జరిగితే ప్రభుత్వానికి అంతలా ఆదాయం పెరుగుతుంది. కానీ.. హైడ్రా ఎఫెక్ట్‌తో రిజిస్ట్రేషన్లు చాలా వరకు తగ్గిపోయాయి. దాంతో ప్రభుత్వ ఆదాయం కూడా కాస్త మందగించినట్లుగానే తెలుస్తోంది. నిజానికి ఏటా దసరా, దీపావళి వేళ హైదరాబాద్‌లో ఇళ్లు సేల్స్ ఎక్కువగా కనిపిస్తాయి. చాలా మంది ఇళ్లు కొనాలనుకునే వారు ఈ రెండు పండుగలను బేస్ చేసుకొని కొంటుంటారు. కానీ.. ప్రస్తుత పరిస్థితులు అలా కనిపించడం లేదు. కొత్త ఇల్లు కొనేందుకు ఎవరూ సాహసించడం లేదు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే కరోనా సమయంలోని పరిస్థితులనే చూడాల్సి వస్తుందని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.మరోవైపు.. రేవంత్ రెడ్డి సర్కార్ ముందు కూడా ఎన్నో లక్ష్యాలు ఉన్నాయి. ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాల్సి ఉంది. అటు.. గత ప్రభుత్వం చేసిన అప్పులనూ మోయాల్సి ఉంది. కానీ.. ఈ సమయంలో ఆయన హైడ్రాను తీసుకురావడం కూడా సంచలనంగా మారింది. హైదరాబాద్ నగరంలో 42 శాతానికి ఇళ్ల అమ్మకాలు పడిపోయాయంటే ముందుముందు మరిన్ని భయంకర పరిస్థితులు తప్పవేమో అన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి. వీటన్నింటిని కాదని రేవంత్ సర్కార్ కూడా ఎలా ముందుకు వెళుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో హైడ్రాపై ఏ మాత్రం వెనక్కి తగ్గేది లేదని, ఆ సంస్థకు పూర్తిస్థాయి అధికారాలు కట్టబెట్టి, చట్టబద్ధత కల్పించడంలో వెనకడుగు వేసేదే లేదని తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి ఆక్రమణలకు గురైన చెరువులను, కుంటలను కాపాడటంలో రాజీపడే ప్రసక్తే లేదని, ఓ మంచి పని చేసే సమయంలో కొంత నష్టం తప్పదని మంత్రులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారట సీఎం రేవంత్ రెడ్డి.హైడ్రా ముఖ్య ఉద్దేశం, భవిష్యత్తు తరాలకు జరిగే మంచి గురించి ప్రతి సందర్భంలోను ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేయాలని మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్ సూచించినట్లు సమాచారం. మొత్తానికి హైడ్రాపై రియల్ ఎస్టేట్ ఆదాయం తగ్గినా.. ముఖ్యమంత్రి మాత్రం భవిష్యత్ తరాల బాగు కోసం ఏ త్యాగమైనా చేయాల్సిందేనని తేల్చి చెప్పారట. దీంతో మంత్రులు కూడా ఇంక చేసేదేమీ లేక హైడ్రాకు జైకొట్టారని టాక్.

# మూసి నది కోసం పాకిస్తాన్ కంపెనీనా...

హైదరాబాద్: దేశ రాజకీయాల్లోనే సంచలనం కలిగించే వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి కేటీఆర్ చేశారు. హైదరాబాద్‌లో జరగబోయే మూసీ నది సుందరీకరణ పనుల విషయంలో చేసిన కామెంట్స్ ఇప్పుడు హాట్ టాపిక్ అవుతున్నాయి. ఫతేనగర్‌లోని సీవేజ్ ప్లాంట్ పని తీరు పరిశీలించేందుకు వెళ్లిన కేటీఆర్ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి, మూసీ సుందరీకరణ పనులపై హాట్ కామెంట్స్ చేశారు. మూసీ సుందరీకరణ పనులు పాకిస్థాన్ కంపెనీకి సీఎం రేవంత్ రెడ్డి కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు కేటీఆర్. మూసీ సుందరీకరణ ప్రక్రియను తాము ప్రారంభించామని గుర్తు చేశారు. మూసీలో కొత్తగా చేయడానికి ఏం లేదని చెప్పారు. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం చాలా చేసిందన్నారు. అయినా సరే మూసీ ప్రాజెక్టు కోసం లక్షా 50 వేల కోట్లు అని ఒకసారి 50 వేల కోట్లు అని ఇంకొకసారి, 70వేల కోట్ల మరోసారి రేవంత్ చెబుతున్నారని విమర్శించారు. మీరు చేయాల్సిన పనులను గతంలోనే చేశామన్నారు. ఇప్పుడు అంత ఖర్చు పెట్టి ఏం చేస్తారో ప్రజలకు చెప్పాలని అన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మూసీ ప్రక్షాళనను బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడో చేపట్టిందన్నారు కేటీఆర్. అందులో భాగంగానే ప్రతిరోజూ 20 కోట్ల లీటర్ల మురికి నీటిని శుద్ధి చేయాలనే ఉద్దేశంతో 4 వేల కోట్ల రూపాయలతో 31 ఎస్టీపీల? ఏర్పాటు చేశామన్నారు. వంద శాతం సీవరేజ్ ట్రీట్‌మెంట్ చేసే సిటీగా హైదరాబాద్‌ను మార్చాలనే సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కూకట్‌పల్లి ఫతేనగర్ లోని 133 ఎంఎల్‌డీల ఎస్టీపీ ప్రారంభానికి రెడీగా ఉందని త్వరలోనే మిగతా ప్రాంతాల్లోని ఎస్టీపీలను సందర్శిస్తామన్నారు. మురికి నీరు వెళ్లడంతోనే మూసీకి ఈ దుస్థితి వచ్చిందని అన్నారు కేటీఆర్. ఈ ఎస్టీపీలన్నీ పని చేసి స్వచ్ఛమైన నీరు మూసీలోకి వెళ్తే ప్రత్యేకంగా సుద్ధి చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. అలాంటి విషయం పై సీఎంతోపాటు మిగతా మంత్రులు కాంగ్రెస్ నేతలు నోటికొచ్చిన ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలా రోజుకో రకమైన మాటలు వింటుంటే అనేక అనుమానాలు కలుగుతున్నాయని విమర్శించారు. ఈ సుందరీకరణ పేరుతో భారీ కుంభకోణం జరుగుతోందని దాన్ని బయటకు తీస్తామని హెచ్చరించారు. పాకిస్తాన్‌కు చెందిన కంపెనీలకు ఈ పనులు కట్టబెట్టే ప్రయత్నాల్లో రేవంత్ ప్రభుత్వం బిజీగా ఉందన్నారు. అన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని కచ్చితంగా బుద్ది చెప్పే టైం వస్తుందని జోస్యం చెప్పారు. సుందరీకరణ పేరితో నాటకాలు ఆపి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అన్నారు. అక్కడ కొత్తగా చేయాల్సిందేమీ లేదన్న కేటీఆర్... రైతుభరోసా లాంటివి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పబ్లిసిటీ స్టంట్లతో ఎక్కువ కాలం ప్రజలను మభ్యపెట్ట లేరని హెచ్చరించారు. కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్‌కు చేసిన మంచి ప్రజలకు బాగా తెలుసు అన్నారు. మూసీ చుట్టూ ఉన్న వాళ్లకు 12 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామన్న రేవంత్ ప్రకటనను కేటీఆర్ స్వాగతించారు. అయితే గతంలో చేసిన ప్రకటనలు వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా కట్టించలేదని ఆరోపణలకు ఇచ్చే సమాధానమేంటని నిలదీశారు. ఇప్పుడు డిప్యూటీ సీఎంగా ఉన్న భట్టి విక్రమార్కను నగరమంతా తిప్పి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు చూపించిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు. అంతే కాకుండా ఇప్పుడు అవే ఇళ్లను మూసీ బాధితులకు ఇస్తామని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. వాటిని కేసీఆర్ ప్రభుత్వం కట్టకపోయి ఉంటే... ఇప్పుడు ఎలా ఇచ్చేవాళ్లని అడిగారు. ఫార్మా సిటీ భూసేకరణపై కూడా రకరకాల ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు కేటీఆర్.

నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్స్: తెలంగాణలో హైడ్రా వ్యవహారం తీవ్ర చర్చనీయాంశం అవుతున్న వేళ ప్రభుత్వం నష్టనివారణ చర్యలు చేపట్టింది. త్వరలో మూసీ ప్రక్షాళణ కూడా మొదలు కాబోతున్న : తెలంగాణలో హైడ్రా వ్యవహారం తీవ్ర చర్చనీయాంశం అవుతున్న వేళ ప్రభుత్వం నష్టనివారణ చర్యలు చేపట్టింది. త్వరలో మూసీ ప్రక్షాళణ కూడా మొదలు కాబోతున్న నేపథ్యంలో నిర్వాసితుల్ని ముందుగానే గుర్తించి వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూసీ నిర్వాసితులకు 16వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. మూసీ రివర్ బెడ్, బఫర్ జోన్ లో నివాసం ఉంటున్న వారిని అక్కడినుంచి తరలించి ఆర్థిక సాయం అందిస్తారు. అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇంటిని కూడా ఇస్తారు. అధికారంలోకి వచ్చాక మూసీ ప్రక్షాళణ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి. లండన్ పర్యటనలో థేమ్స్ నదిని ఆయన పరిశీలించి వచ్చారు. అదే తరహాలో ఇక్కడ కూడా మూసీని ప్రక్షాళణ చేస్తామని చెప్పారు. నిధుల కేటాయింపుకి కూడా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. అయితే అసలు సమస్య అంతా నిర్వాసితుల తరలింపుతోనే ముడిపడి ఉంది. మూసీనది చాలా చోట్ల ఆక్రమణలకు గురైంది. మూసీ రివర్ బెడ్ పరిధిలో, బఫర్ జోన్ పరిధిలో పేదలు నివాసం ఉంటున్నారు. వరదలు వచ్చినప్పుడు వారు తీవ్రంగా నష్టపోతారు. అయితే ప్రత్యామ్నాయం లేక తిరిగి అక్కడికే చేరుకుంటున్నారు. వారందర్నీ తరలించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం హైడ్రా చర్యల వల్ల కూడా చాలామంది నష్టపోయారు, బాధితులతోపాటు ప్రతిపక్షం కూడా తీవ్ర విమర్శలు చేస్తోంది. మూసీ విషయంలో ఆ తప్పులు లేకుండా నిర్వాసితుల్ని ముందుగానే సంతృప్తి పరచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సర్వే చేపట్టింది. ఆ సర్వేలో 10,200 మందిని నిర్వాసితులుగా గుర్తించారు. వారందరికీ ప్రత్యామ్నాయంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయిస్తున్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్, హైదరాబాద్ మెట్రో రైలు సహా.. పలు ఇతర అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష అనంతరం మూసీ నిర్వాసితులకోసం 16వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

# ప్రభుత్వం రేషన్ డీలర్ల హామీలు నెరవేర్చాలి

**– సీఎంను కోరిన రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు గోపతి వెంకటేశ్వర్లు**

జగిత్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రేషన్ డీలర్లకు తగిన విధంగా న్యాయం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారని వాటిని అమలు చేయాలని జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు గోపతి వెంకటేశ్వర్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లుసమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ లో సమావేశం నిర్వహించగా జగిత్యాల జిల్లా నుండి పెద్ద ఎత్తున వారు హాజరుకాగా గోపతి వెంకటేశ్వర్లు, వేముల ఆనంతరెడ్డి, టేకుమల్ల విజయ, కలమడుగు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రేషన్ డీలర్లకు 5 వెల గౌరవవేతనం, క్వింటాలుకు 300 కమిషన్, హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించడంతో పాటు దిగుమతి హమాలీలకు కూలీ ప్రభుత్వమే భరించడం వంటి ఎన్నికల హామీలను అమలు చేయాలని వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.రేషన్ డీలర్లు చాలి చాలని కమిషన్ తో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం ఆదుకోవాలని వెంకటేశ్వర్లు కోరారు. అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతుందని ముఖ్యమంత్రి చొరవచూపి వెంటనే హామీలను అమలుపర్చలని విజ్ఞప్తి చేశారు.

# బీఆర్ఎస్ వాళ్ళవి క్రిమినల్ మైండ్ లు

మెదక్: బీఆర్ఎస్ పార్టీలో ఉన్నవాళ్లు ఇవ్వాలో రేపు మన పార్టీలోకి వస్తారు. వాళ్ళని ఏమి అనవద్దు వాళ్ళు కూడా మనవాళ్లే. పార్టీలకు అతీతంగా అరికెపుడి గాంధీ నాకు ఇష్టమని కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మంగళవారం అయన మెదక్ లో మీడియాతో మాట్లాడారు.10 కోట్లు ఇచ్చి ఎమ్మెల్యేలను కోనుగోలు చేసిన చరిత్ర బీఆర్ఎస్ ది. కానీ గాంధీ ఒక్క రూపాయి తీసుకోకుండా బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ విమర్శలు చేస్తున్నారు. కేటీఆర్ రేపటి నుంచి నీకు ఉంటుంది ఇక కాసుకో బిడ్డా. కొండగట్టు లో బస్సు ప్రమాదం, మాసాయిపేట ఘోర రైలు ప్రమాదం జరిగినప్పుడు కేసీఆర్ ఎక్కడున్నారు. ప్రభుత్వం పోగానే తెలంగాణ, ఆంద్ర అంటూ చిచ్చు పెడుతున్నారు. సెక్రటేరియట్ ను కూల్చి బీఆర్ఎస్ వాళ్ళు నిధులు ఎత్తుకెళ్లారు అన్న ప్రచారం ఉంది. ఈ రోజు మీరు కట్టిన సెక్రటేరియట్ లో అన్ని లీకులు అవుతున్నాయి. బీఆర్ఎస్ వాళ్ళవి క్రిమినల్ మైండ్ లు... విద్యుత్ అధికారులు కొందరు బీఆర్ఎస్ వాళ్ళకి సహకరిస్తున్నారు. బీఆర్ఎస్ మీటింగ్ లకి వాళ్లే కావాలని కరెంట్ కట్ చేస్తున్నారని అన్నారు.

# ఎన్సిసి తో రక్షణ దళాల్లో ఉద్యోగ అవకాశాలు

జగిత్యాల: ఎన్సిసి తో రక్షణ దళాల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సుబేదార్ మనోజ్ సింగ్ సూచించారు. స్థానిక ఎస్ కే ఎన్ ఆర్ గవర్నమెంట్ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో ఎన్సిసి ఎన్రోల్మెంట్ కార్యక్రమానికి 9వ బెటాలియన్ నుండి ఆర్మీ అధికారి సుబేదార్ మనోజ్ సింగ్, హవల్దార్ ఉపేందర్ సింగ్ పాల్గొన్నారు. ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విద్యార్థులను శారీరక దృఢత్వం పరుగు పందెం లలో సామర్థ్య పరీక్షలు నిర్వహించి ఎన్సిసి లోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా మనోజ్ సింగ్ మాట్లాడుతూ ఎన్సిసి ద్వారా మంచి వ్యక్తిత్వం క్రమశిక్షణ దేశభక్తి పెంపొందుతుందని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు ఎన్సిసి సర్టిఫికెట్ ద్వారా త్రివిధ దళాల్లో ఉద్యోగాలు లభిస్తాయని అలాగే రక్షణ దళాల్లో పోలీస్ వివిధ యూనిఫామ్ సర్వీసెస్ లలో అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు.ఆనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య అరిగెల అశోక్ మాట్లాడుతూ ఎన్సిసి తమ కళాశాలకు ఎంతో గర్వకారణమని ఎంతోమంది క్యాడెట్లు త్రివిద్య దళాల్లో రక్షణ రంగంలో ఉద్యోగాలు సాధించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్సిసి అసోసియేషన్ సిసి అధికారి లెఫ్టినెంట్ పర్లపల్లి రాజు, సీనియర్ కాడేట్లు రాకేష్, అంజి,ప్రవీణ్ అశ్విని, అనూష,తదితరులు పాల్గొన్నారు

# 24గంటల్లో 41కాన్పులు చేసి పాలమూరు ప్రభుత్వ వైద్యుల రికార్డు

మహబూబ్ నగర్: ప్రభుత్వ ఆసుప్రతిలో ప్రసవాల సంఖ్య సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. 24గంటల్లో 41కాన్పులు చేసి పాలమూరు ప్రభుత్వ వైద్యులు రికార్డు సృష్టించారు. మహబూబ్ నగర్ జిల్లా ప్రభుత్వ జనరల్ అస్పత్రిలో ఒక్కరోజులో పెద్ద మొత్తంలో డెలివరీలు నిర్వహించారు వైద్యులు. సెప్టెంబర్ 19వ తేదీన ఒక్కరోజే 41 కాన్పులు చేసి మతాశిశు విభాగ వైద్యులు రికార్డు సృష్టించారు.ఈ కాన్పుల్లో 42మంది శిశువులు జిల్లా అస్పత్రిలో ఒక్కరోజే జన్మించారు. ఒక మహిళ కవలలకు జన్మనివ్వడం విశేషం. మొత్తం కాన్పుల్లో 16మంది మగ, 26మంది ఆడ శిశువులు ఉన్నారు.మొత్తం 10మంది వైద్యులు నిర్వహించిన 41 కాన్పుల్లో 10 నార్మల్ కాగా, 31 సీజేరియన్ డెలివరీలు అయ్యాయి. గతంలో ఇదే ఆసుపత్రిలో ఒకే రోజు 43 కాన్పులు చేసి ఔరా అనిపించారు.సాధారణంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అస్పత్రిలో మతాశిశు విభాగానికి మహిళలు పెద్ద ఎత్తున ప్రసవానికి వస్తున్నారు. ప్రతిరోజు సుమారు 600 నుంచి 800మంది వరకు గర్భిణిలు ఓపీ కోసం వస్తుంటారు. ప్రైవేటు అస్పత్రులకు ధీటుగా ఈ విభాగం ప్రతిరోజూ కిటకిటలాడుతోంది. అలాగే ప్రతిరోజూ దాదాపు 30నుంచి 35 వరకు కాన్పులు నిర్వహిస్తున్నారు. ఇక రానున్న రోజుల్లో ఈ డెలివరీల సంఖ్యను పెంచే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఎలాంటి పరిస్థితుల్లో వచ్చినా ఎంత మంది వచ్చినా చికిత్స విషయంలో రాజీ ఉండదంటున్నాయి జిల్లా ఆస్పత్రి వర్గాలు.ఇక, పెద్ద ఎత్తున డెలివరీలు నిర్వహించిన మతాశిశు విభాగాన్ని సూపరింటెండెంట్ సంపత్ కుమార్ సింగ్ అభినందించారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**